జ్యోతిష్పథం

# ఉత్తమ ఆలోచనలు రానివ్వాలి



– డిఎస్సార్

శరీరానికి మంచి ఆహారం ఎంత అవసరమో మనసుకు మంచి ఆలోచనలు అంతే అవసరం. మనసు పదునెక్కడానికి అవి అవసరం. మన ఆరోగ్యానికి ఏ రకం ఆహారం మంచి చేస్తుందో, ఏ రకం ఆహారం చెడు చేస్తుందో తెలుసుకొని మన ఆహారాన్ని క్రమపర్చుకొని నియమం తప్పకుండా తీసుకుంటాము కదా! అలా కాకుండా అడ్డమైన మిఠాయులు తినడం అలవాటు చేసుకుంటే అప్పుడు శరీరం బలహీనపడి, నయం కాని రోగాలపాలు కావాల్సి వస్తుంది. అదేవిధంగా చెడు ఆలోచనలు పెరగనిస్తే, మనసు కూడా బలహీనమౌతుంది. ఇది మానసికంగా, భౌతికంగా రోగాలకు దారితీసి మనలను సర్వనాశనానికి లోను చేయగలదు.

మనసు అనేది ఆలోచనల ప్రవాహం. ఆలోచనలే లేవు అనుకోండి మనస్సుతో పనిలేదు. మనస్సును అదుపు చేయాలంటే, ఆలోచనల సరళి తెలుసుకోగల్గాలి. ఏ ఆలోచనలు అంగీకరించాలో, ఏ ఆలోచనలు తిరస్కరించాలో మనకి తెలిసి వుండాలి. ప్రధానమంత్రి తనకు అవసరమైన మంత్రులను వారి మేధాశక్తిని గుర్తెరిగి తీసుకుంటాడు కదా! వారి అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలా, వద్దా అనేది నిర్ణయించుకున్నాక మంత్రులను మంత్రివర్గంలోకి తీసుకోవడం జరుగుతుంది. అలాగే మన మనస్సులో వచ్చే భావాలను అర్థం చేసుకొని పరిస్థితులకు అనుగుణంగా బేరీజు వేసుకోవాలి.

ఒక్కొక్కప్పుడు, మన మనస్సులో ఆలోచనలు పెరగడం మనం గమనించం. కలుపు బాగా వుంటే, ధాన్యపు గింజలు ఎలా పెరుగుతాయి? కలుపు మొక్కలు వెంటనే బాగా లోతుకు పాతుకుపోతాయి. ఎరువుల నెన్నింటిని వేసినా వాటిని పీల్చుకొని, పంటను నాశనం చేయగలవు. కాని ఈ కలుపు మొక్కలను తొలగించి కావాల్సినంత నీరు, సరిపోయినంత ఎరువులు సకాలంలో యిస్తూ ఉండాలి. పురుగులు పట్టకుండా సరైనా మందులను వెదజల్లాలి. ఈ విధంగా చాలా జాగ్రత్తగా మెళుకువులు తీసుకుంటూ వుండాలి. అప్పుడే సరియైన పంట చేతికి వస్తుంది. ఈవిధంగానే ప్రతిక్రియాత్మక ఆలోచనలు తమంట తాముగా

పెరగకుండా కట్టడి చేయాలి. మంచి ఆలోచనలు పెరిగేటట్లు ఉద్దేశ పూర్వకముగా మనం కృషి చేయాలి.

ఒకసారి ఓ తాతగారు తన మనవడిని జంతుప్రదర్శన శాలకు తీసుకు వెళ్ళాడు. ప్రక్కప్రక్కనే ఉన్న బోనులలో రెండు సింహాలున్నాయి. ఒక సింహము ప్రశాంతంగా నిలుచుని వుంది. బోను దగ్గరకు ఎవరు వెళ్ళినా కూడా, చేత్తో దానిని తరిమిన కూడా, ఏమీ అనేది కాదు. ఆ సింహం మనుషులు వచ్చారు అని గుర్తించింది. రెండో సింహం దగ్గరకు ఎవరైనా వెళ్తే గాండ్రించేది. ఎవరయినా బోను దగ్గరకు వస్తే తన పంజాతో కొట్టడానికి ప్రయత్నం చేసేది. ఈ కారణంగా ఆ సింహం వున్న బోను దగ్గరకు ఎవరూ వెళ్ళేవారు కాదు. తాతగారు తన మనవడిని అడిగారు. "ఈ రెండుసింహాలు తలబడ్డాయి అనుకో ఏ సింహం గెలుస్తుంది?" మనవడి ఆలోచన గంభీరంగా ఉంది. " ఏ సింహానికి ఎక్కువగా ఆహారం పెడ్తారో ఆ సింహం గెలుస్తుంది..." అన్నాడు.

ఇదే విధంగా మన భావాల సరళి కూడా వుంటుంది. ప్రతిక్రియాత్మక భావాలను పెరగనిస్తే గర్వం, కోపం పెరగ వచ్చు. అవి మరింతగా బలపడవచ్చు. మానసికంగా, భౌతికంగా మన వైఫల్యాలకు కారణమవుతుంది. ఈ ప్రతి క్రియాత్మక ఆలోచనలు ప్రబలి, అధర్మం, అరాచకం ఇతర అనేక జాడ్యాలు సమాజంలో ప్రబలటం మనం చూస్తూనే ఉన్నాము. అయితే, పాజిటివ్ భావాలు పెరిగితే మన మనస్సులలో ప్రేమ, కరుణ, దయ, ఓర్మి అనే భావాలు పెంపొందించగల్గితే అవి మన హృదయ మంతా నిండి పోయి, శాంతి తృప్తి లాంటివి సమాజంలో వెల్లివిరుస్తాయి.

ప్రేమ, ఓర్పు, విచక్షణ అనే మూడు గుణాలు మన జీవనానికి పునాది. ఈ మూడింటిని సంపాదించాలి, నేర్చుకోవాలి. అపుడు జీవితంలో అన్నింటినీ పొందగల్గుతాము.

ఈ యదార్థాన్ని అర్థం చేసుకోగల్గితే మన జీవనంలో స్వర్గాన్ని సృష్టించు కోగలము. మన మనస్సే అన్నింటికి మూల కారణము. స్వర్గ నరకాలను సృష్టించగల్గేది మనస్సే. కాబట్టి మనస్సును అదుపులో ఉంచుకోవాలి.

# ఇచ్చుటలో వుంది ఆనందం !!!

స్వామి రామతీర్థుల వారు (1873–1906). ఆయన లాహోర్ కళాశాలలో లెక్కల ప్రొఫెసర్‌గా పనిచేశాడు. గొప్పదేశభక్తుడు, సన్యాసిగా మారాడు. ప్రతిరోజూ తిరుగుతూ దయ, ప్రేమ గురించి చెప్తుండేవాడు. తన వంట తానే చేసుకునేవాడు.

ఒక సాయంత్రం చాలా దూరం పయనించి అలసిపోయి వచ్చి వంట పని ప్రారంభించాడు. ఆ సమయంలో ఆకలిగొన్న బాలల సమూహం ఆయన ఇంటికి వచ్చారు. వండిన వంటను ఆ పిల్లలకు వడ్డించాడు.

ఇదంతా గమనిస్తున్న ఒక వ్యక్తి చాలా ఆశ్చర్యపోతూ అడిగారు.” స్వామిజీ! వంట నంత వాళ్ళకు పెట్టారు, మీకేముంది?” అని ప్రశ్నించాడు.

“ఆకలిని తీర్చేందుకు ఆహారం అవసరం కదా? ఏ పొట్టలోకి ఈ ఆహారం వెళ్లిందనేది సమస్య కాదు. దాని పని అది చేసింది. నేను తీసుకోవడంలో వున్న ఆనందం కన్నా, ఇచ్చుటలో వున్న ఆనందం ఎన్నో రెట్లు ఎక్కువ.”

ఎందుకు ఎక్కువో – ఆ కారణాలు చెపుతాను విను.

1) ఇవ్వటమనేది మనలోపలి ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. బహుమతులు తీసుకోవడంలో వున్న ఆనందం మనందరికీ విదితమే! కాని అది తాత్కాలికమే!

2) తన బహుమతిని తనకే యిచ్చుకుంటుంది. నిజం చెప్పాలంటే మనఃపూర్తిగా యిస్తుంటే జీవితమంతా ఎంతో ఆనందంగా వుంటుంది. ఆత్మ తృప్తి కల్గుతుంది. విలువైన బహుమతి కన్న ఇవ్వటం అనేది ఎంతో విలువైనది. మహాత్మాగాంధి అంటారు “నిన్ను నువ్వు తెలుసుకోవాలంటే ఇతరుల సేవలో నిన్ను నీవు సమర్పించుకోవాలి”.

3) నిన్ను నీవు సమర్పించుకోవడమే ఇతరులకు యివ్వడమంటే. ఎదుటివారు ఏమి యిస్తాడనే ఆలోచనలేకుండా యివ్వడంలో సంతోషముంది.

4) ఇతరులు సుఖంగా వుంటే మనకూ సుఖంగా ఉంటుంది. మానవ జీవనం నిర్ధారించేదేమంటే, యిరుతల సుఖంలోనే మన సుఖం కూడా యిమిడి వుంది. అంతేగాని మనకు మనమే బాగుండాలి అనుకోవడంలో లేదు.

5) ఇతరులు అడగవచ్చు నిన్ను ఎందుకివ్వాలి?అని జవాబుగా "భగవంతుడు ప్రేరణ నిచ్చాడు నాకు నేను బాగా ఉన్నాను. ఇతరులకు లేదు కనుక, నేను పంచుతున్నాను. ఇది నా జన్మహక్కు.

6) మనం మన ప్రపంచం నుంచి బయటపడి ఇంకొకరి ప్రపంచంలోకి అడుగిడి నపుడు వాళ్ళ బాధలు కన్నా మన బాధలు పెద్దగా చెప్పుకోదగ్గవి కావు.

7) ఇవ్వడం అనేది మన ఆత్మ గౌరవం పెంచుతుంది.

8) ఇవ్వడం అనేది మంచి పెట్టుబడిగా భావించాలి. దాని వల్ల అసలు సిసలైన సంతోషం పొందవచ్చు.

ఇవ్వటం అనేది మన హృదయస్సంపద. నువ్వు ఎంత ఎక్కువయిస్తే అంతకు అంత తీసుకోగలవు.

చైనా సామెత "నువ్వు యివ్వటం ప్రారంభిస్తే, యిస్తూనే వుంటావు" అని అమెరికన్‌లో మంచి రచయిత కెన్‌బ్లెంచర్డ్ డిక్లేర్డ్... "నేను ఎంత యిస్తానో అంతకు అంత నాకు వెనక్కి వస్తుంది" అని. అనేక సంస్థల వారు, ఇన్‌స్టిట్యూషన్స్ వారు వ్యక్తులు ఎందరో విరాళాలు యిస్తున్నారు. సంజిత్‌బంకర్‌రాయ్ – బేర్‌పుట్ కళాశాల తన జీవితమంతా బీదసాదలకు ముఖ్యంగా గ్రామీణ నిరుపేదలకు సహాయం చేస్తుంటారు. ఈ కళాశాలవారు ఆఫ్రికా నుంచి హిమాలయ ప్రాంతాల వరకు గ్రామీణ మహిళలకు సూర్యశక్తి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఇంజనీరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా మారు మూల గ్రామాల వారికి విద్యుత్‌ను అందిస్తున్నారు.

**భవాన్స్ జనరల్ సౌజన్యంతో**

# సంరక్షక విరాళం

కాకినాడ సమాజ కార్యదర్శి శ్రీ పెండ్యాల సుబ్బారావు గారి తల్లిదండ్రులైన శ్రీమతి పెండ్యాల భానుమతి, శ్రీ పెండ్యాల భాస్కరరావు దంపతులు తమ 71వ వివాహ వార్షికోత్సవము మే 10, 2020 వ తేదీన జరుపుకొన్న సందర్భంగా దీపికకు అందించిన విరాళం రూ. 1,000/– వీరికి దీపిక శుభాకాంక్షలు మరియు ధన్య వాదములు తెలుపుతున్నది.

# భౌగోళిక మార్పులు - మానవ జాతులు - ప్రళయాలు

శ్రీమతి యం.రాజసరస్వతి, గుంటూరు
సెల్ : 9490541800

పాతవి మునిగి, క్రొత్త భూమి ఏర్పడటం జరిగే ప్రక్రియే భౌగోళిక మార్పులు. భూమి గట్టిపడే ప్రక్రియలో వెనుకకు ముందుకు వూగిసలాడు తుందని సైన్సు, అక్కల్టిస్టులు చెప్తున్న విషయమే. ఒకవేళ అట్లాంటిస్ తిరిగి పైకి లేస్తే ఎలా వుంటుందన్న ప్రశ్న. చాలా కాలం నిర్జీవంగా వుండవలసిందే. అట్లాంటిక్ సముద్ర అడుగు భాగము 5000 అడుగులు “chalk” పదార్థంతో నిండి క్రిటేషియస్ పొరలతో వుంది.

అనేక ఖండాలు కాలానుగుణంగా భౌగోళిక మార్పులు కారణంగా మునగటం, లేవటం జరిగినాయి. సంస్కృత, తమిళ గ్రంథాలలో ఈ విషయం వ్రాయబడింది. సూర్య సిద్ధాంతంలో, అసురమయ ఖగోళ శాస్త్రంలో కూడా వున్నది.

స్వాయంభువ మనువు తన సప్త పుత్రులకు ఇచ్చిన వాటిలో అట్లాంటిస్ లేదు. ఆ ద్వీపాలు కొందరు అట్లాంటియనులకు రక్షణ యిచ్చి వుండవచ్చు. కాని ఆ ద్వీపాలు మన భూగోళ ప్రాంతాలు కావు. ఇతర గ్రహభాగాలు. గుప్తజ్ఞానంలో వాటి గురించి వున్నది. జంబూద్వీప మొకటే భూగోళానికి చెందినది. పురాణాలలో ‘మేరువు’ ఉత్తర ప్రాంతము అని చెప్పబడింది. ఉత్తర ధృవప్రాంతము లెమూరియా మునిగినపుడు కొన్ని భాగాలు పైకి లేచాయి. అందువల్ల నాల్గవ జాతి అట్లాంటియనులు కొన్ని భాగాలపై జీవించారు. ఈస్టరీ ద్వీపము కూడా ఆ విధంగా అట్లాంటి యనులు నివసించిందే. World map మొదటిసారి 1507లో పబ్లిష్ అయ్యేవరకు అమెరికాను ఇండియా భాగంగా అనుకున్నారు. ఇండియా, యస్. అమెరికా మధ్య కొన్ని ద్వీపాలు బెల్టువలె వున్నాయట. ఇండియాకు పురాతన కాలంలో North మరియు South America ల వరకు సంబంధాలుండేవని ఒక వాదము. గతకాలాలలో ఏ ఖండము ఏ ఖండభాగమో మనకు తెలియదు గదా!

Ernst Hackel ఆదిమ మానవుడు apes నుంచి పరిణామం చెందినది S. Asia or E. Africa అయి వుంటుందన్నారు. అప్పుడు జీవించి వున్నది

లెమూరియనుల కాలం అయి వుంటుంది. లెమూరియా కూడా హిందూ మహా సముద్రంలో మునిగిందని (ఇండియా, సుంద ద్వీపాల మధ్య ఆఫ్రికా మెడగాస్కర్ మధ్యలో) అని అంచనా. మహాఖండము అక్కడక్కడ మునిగి అనేక భాగాలుగా విరిగింది. ఇప్పటి ఆసియా, సిస్. హిమాలయన్ ప్రాంతాలు, శ్వేత ద్వీపము, గ్రీన్‌లాండ్, East, West, Siberia ఇవన్నీ. మునిగిన మహా ఖండము ఇండియా, అట్లాంటిక్, ఫసిఫిక్ మహాసముద్రాలన్నింటికన్నా ఘనమైనది. అనేక మహాద్వీపాలు కలిగింది. అన్ని ద్వీపాలు క్రమేణా మునిగినాయి. ఈస్టర్ ద్వీపము మూడవ మూలజాతి మొదటి నాగరికతలకు చెందినది. అన్నింటితో పాటు మునిగి, అగ్నిపర్వతాలు పైకి లేచినపుడు లావాతో కొన్ని శిల్పాలు పైకి లేచి లెమూరియా ఉనికికి ఋజువులుగా మిగిలాయి. కొన్ని ఆస్ట్రేలియా జాతులు కూడా ఋజువులుగా మిగిలాయి. హెకల్ ఈ జాతుల గురించి మాట్లాడుతూ ఇవి, ఒకనాడు ఒక గైజాంటిక్ ఖండము వున్నది అనటానికి గుర్తులు అన్నాడు. ఆస్ట్రేలియా ఒక భాగముగా, కాలిఫోర్నియా ఒక భాగముగా మిగిలి పోయాయి.

ఆస్ట్రేలియా మారకుండా, మొదటి ఆదిమజాతి లక్షణాలను కల్గి వుంది మానవ ప్రాథమికతకు ఇల్లుగా వున్న ఉత్తర ఆసియా ప్రాంతమంతా విస్తరించి తర్వాత వచ్చిన soft haired races అన్నింటికి మూలమైంది. వీరినుంచే ఆర్యన్ హిందువులు, ఈజిప్షియనులు, పాత పర్షియనులు ఒక శాఖగా ఛాల్డియనులు, ఫొయెనీషియనులు వేరొక శాఖగా ఏర్పడినారు. వారు దివ్య సామ్రాజ్యాలను ఏర్పరిచారు. మర్త్యులు కొందరు, ఉన్నత గోళాల నుంచి మన్వంతరాలలో కూడా జీవించినవారు కొందరు ఉండేవారు. కాటరైనిడ్స్‌గా వర్ణించింది మర్త్యులనే. తోక ఎముకలు కలిగిన కొన్ని జీవులు. వీరిలో రెండవ భాగము మూడవ మూలమానవజాతిగా పరిగణింపబడినారు. పితరుల దేహభాగాలు కలిగి సప్తద్వీపాలలో విస్తరించిన మూడవజాతి బాగా అభివృద్ధి చెందినది.

భూమి అక్షము మరల ఒరిగింది. సూర్యచంద్రుల గతి తప్పి, మొక్కలు, జంతువులు అన్నీ పొట్టిగా మారినాయి. ఇది మూడవ ప్రళయకాలము.

అక్షములో మార్పులు, వాతావరణ మార్పులు, వీటిన్నింటికీ స్పందనగా జీవుల్లో మార్పులు సహజము. దీనికి కర్మ సిద్ధాంతము తప్ప సమాధానము చెప్పగలిగేది ఏదీ లేదు. కర్మ సూత్రము

అనేది అనేక భౌగోళిక మార్పుల రూపములో పనిచేస్తుంటుంది. Fohat, విశ్వమేధస్సు కల్గి కర్మసూత్రాన్ని నడుపుతూ ఉంటుంది.

వైవస్వత మనుసంతతి భూమి మీద ఏర్పడినప్పటి నుండి 4 అక్షపు మార్పులు సంభవించాయి. భూమి ప్రతిసారీ మారింది. జీవులూ ప్రకృతివరణ సిద్ధాంతాన్ని అనుసరించి మారాయి. దానికి వందల వేల సంవత్సరాల కాలము పట్టింది.

"లెమూరియన్ గొప్ప ప్రళయం తర్వాత మానవ సైజు తగ్గింది, జీవ ప్రమాణం కూడా తగ్గింది. దివ్యత్వము నుంచి జంతు తత్వానికి పడిపోయారు. ధ్రువాల వద్ద వున్న పొట్టి జాతి వారితో, ఇతర జాతులతో వివాహ సంబంధాలు పెట్టుకుని, కొంత దివ్యజ్ఞానాన్ని కూడా పొందారు. కోరి "వామ పక్షమార్గాన్ని అనుసరించారు" అని వ్యాఖ్యానంలో వున్నది.

ఈ విధంగా అట్లాంటియనుల నాశనం అక్కడే మొదలైంది.

## శ్రద్ధాంజలి



మేరీ ఆండర్సన్‌గారు ఏప్రియల్ 14, 2020 వ తేదీన ఇంగ్లాండులో పరమపదించారు. వీరు అంతర్జాతీయ దివ్యజ్ఞాన సమాజము అడయారుకు ఉపాధ్యక్షురాలిగా మరియు కార్యదర్శిగా పనిచేసారు. వీరు యురోపియన్ ఫెడరేషన్‌కు కార్యదర్శిగా తమ సేవలను అందించారు. అడయారులోని "స్కూల్ ఆఫ్ విజ్‌డమ్"కు డైరెక్టర్‌గా కూడా పనిచేసారు. వారు దివ్యజ్ఞాన విషయములపై ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ఉపన్యాసాలు చేసారు. అలానే అనేక దివ్యజ్ఞాన సమాజ పత్రికలలో వీరు రచించిన ఎన్నో వ్యాసాలు ప్రచురితమైనాయి. వీరి మృతికి దీపిక సంతాపం తెలుపుతున్నది.

# మంచి ప్రవర్తన

**మూలం : కృష్ణమూర్తి** **అనుకరణ : శ్రీమతి అరుణా విజయమోహన్**

స్వేచ్ఛవాతావరణంలోనే మంచి తనం వికసించగలదు. ఏ రకంగా వెంటాడినా, బలాత్కరించినా యిది వికసింపదు. ఒక బహుమాన మిచ్చి నందువల్ల వికసించదు. ఏ రకమైన అనుకరణ వున్నా దేనికి తలవంచినా యిది భయటపడదు. భయమున్నప్పుడు సహజంగా ఇది ఉండదు. మంచితనం ప్రవర్తనలో కన్పిస్తుంది. ఈ ప్రవర్తన నున్నితత్త్వం మీద ఆధారపడి ఉంటుంది. మంచితనం గాదు. ఎంతో క్లిష్టమైన అలోచనను అర్థం చేసుకోవాలి. అలోచనకున్న పరిమితుల గురించిన యోచన అవగాహన మేల్కొల్పుతుంది.

మంచితనానికి వ్యతిరేక మయింది లేదు. మంచితనం చెడుకు వ్యతిరేకమని మనం చాలామంది అనుకుంటాం. చరిత్ర మొత్తంలోనూ ఏ సంస్కృతిలో నైనా మంచితనం చెడుకు రెండవ ముఖంగానే గ్రహించబడింది. అందుకే మంచివాడుగా వుండటానికి మనిషి. ఎప్పుడు ఆ చెడుకు విరుద్ధంగా పోరాడాడు. మనిషిలో హింసగానీ, పోరాటంగానీ ఏ రకంగా ఉన్నా, మంచితనముండలేదు.

మంచితనం ప్రవర్తనలో, క్రియలో, సంబంధ బాంధవ్యాలలో కనపడు తుంది. సాధారణంగా మన దైనిక జీవితం యాంత్రికమైన అంటే కృత్రిమమైన కొన్ని నమూనాలను అను సరిస్తూనో జాగ్రత్తగా లాభ నష్టాలా లోచించి పెట్టుకున్న ప్రేరణల పైనా ఆధారపడి వుంటుంది. కనుక చేతనా చేతనల్లోని మన ప్రవర్తన ఎటువంటిదో చూడాలి. మంచి ప్రవ ర్తనగాదది. దీన్ని కేవలం "తెలివితేటలతో, కూర్చి పెట్టుకున్న పదజాలంతో గ్రహించ గూడదు. మంచిదిగాని ప్రవర్తనను పూర్తిగా వదలి వేయటంలో నిజమైన ప్రవర్తన వెలువడుతుంది.

"స్వార్థం' 'నేను' అన్నవి లేన ప్పుడున్న తత్త్వమే మంచి ప్రవర్తన. ఇది అణకువలోనూ, ఇతరుల పట్ల దయ తోనూ సమగ్రత పోగొట్టుకోకుండా లొంగిపోవటంలోనూ కన్పిస్తుంది. అందుకే ప్రవర్తనెంతో ముఖ్యమైనది. కొట్టిపారవేసేంత సులభ విషయం గాదిది. నాగరికమైన మనసుఒక ఆటవస్తువూ గాదిది. నీలోని లోతుల నుండి వస్తుందది. నీనిత్య జీవితంలో భాగమిది.

మంచితనం చేసే పనుల్లో కన్పి స్తుంది. పనికి ప్రవర్తనకు గల తేడాను చూడాలి మనం. అవి రెండూ

ఒకటేగావచ్చు. కాని స్పష్టతకోసం వాటిని విడదీసి పరీక్షించి చూడాలి. బహుకష్టమైన వాటిలో ఒకటి సరైన పని జేయడం, ఇదెంతో క్లిష్టమైంది. అసహనం లేకుండా, తొందర పాటు నిర్ణయానికి రాకుండా పరీక్షించ వలసింది.

జరిగిపోయినదాన్నుండి కదలి వస్తుంది నిత్యం జీవితంలో మనం జేసే పని. అప్పుడప్పుడు మాత్రం కొత్త నిర్ణయాల తెంపరితనంతో ఉంటుంది. మనిషి భూతకాల సంబంధిత నిర్ణయాల ఆధారంతోనే పని జేసన్తాంటాడు. తానేర్పరచుకున్న భావాలకు ఆశయా లకు అనుగుణంగా పనిజేస్తాడు. తానార్జించిన జ్ఞానాన్నుండి అంటే భూతకాలం నుండి గాని, తాను ఊహించుకున్న భవిష్యత్తు నుండి గాని పనిజేస్తుంటాడు.

అట్టి పని సహజమేనని మన మంగీకరిస్తాం. అది జరిగిన తర్వాతనో చేయబోయే ముందో ప్రశ్నిస్తుంటాం. ఆ ప్రశ్నించటం గూడా ముందే చేసిన నిర్ణయాల ప్రకారమో, భవిష్యత్తుకు సంబంధించిన లాభనష్టాల పైనో ఆధారపడి ఉంటుంది. కాబట్టి చేసేపని గురించి మనమంగీకరిస్తున్న భావం మొత్తాన్ని ప్రశ్నిస్తున్నాం.

జ్ఞానార్జన తర్వాత క్రియం జరుగుతుంది. ఆ పని సంతోషప్రదమైన దైనా కాకున్నా దాన్నుండే పని జేస్తాం, నేర్చుకుంటాం. ఈ నేర్చుకున్నది తిరిగి ప్రోగుబడి జ్ఞానమవుతుంది. ఈ రెండూ జ్ఞానం పైనే ఆధార పడ్డాయి, వేరుగావవి. జ్ఞాన మెప్పుడూ భూత కాలానికి సంబంధించింది. మన పను లెప్పుడు యాంత్రికాలే యాంత్రికమవని పునరావృతం గాని, నిత్యకృత్యముగాని పశ్చాత్తాపం లేని పనేమైనా ఉన్నదా ! దీనర్థంజేసుకోవటమెంతో ముఖ్యం. ఎందుకంటే స్వేచ్ఛ ఉన్నప్పుడు మంచితనం వికసించినప్పుడు క్రియ యాంత్రికమైన దెప్పటికీ గాదు. వ్రాయటం, భాష నేర్చుకోవటం, కారు నడపటం యాంత్రిక మైనవి. ఏరకమైన సాంకేతిక జ్ఞానాన్నైనా సంపాదించటం దాన్ననుసరించి చేయటం యాంత్రిక మవుతుంది. ఈ యాంత్రిక మైన పనిలోగూడా ఆగి, అప్పుడు కొత్త నిర్ణయాలు తీసుకున్నా అది గూడా యాంత్రికమవుతున్నది. అద్భుతమైన మంచితనానికి తప్పక స్వేచ్ఛ గావాలని నిత్యం గుర్తుంచుకోవాలి. యాంత్రికము గాని క్రియ ఉన్నది. దాన్ని మీరు కనుగొనాలి. మీకెవరూ చెప్పరు. ఇందులో మీకే బోధనా ఉండదు. ఉదాహరణలతో నేర్చుకోలేరు. నేర్చు కుంటే అది అనుకరించట మవుతుంది. కట్టబడటమవుతుంది. అప్పుడు మీరు – పూర్తిగా స్వేచ్ఛను పోగొట్టుకుంటారు. అక్కడ మంచితనముండదు.

**(1995 దీపిక సంచిక నుండి)**

# శుభమస్తు నిత్యం

ఎప్పుడూ శుభమే గల్గాలి అంటే సుఖంగా జీవించాలని అర్థం. అశుభం గల్గరాదంటే దుఃఖం కల్గనేరాదని భావం. అందరూ కోరేది శుభాన్నే. అందుకే శ్రుతి అంటుంది– "ఆనందో బ్రహ్మ" అని. ఆనందమన్నా దైవమే – దైవమన్నా ఆనందవేు. రెండు శుభప్రదమైనవే.

శాశ్వత శుభాన్నిచ్చి కాపాడేవాడు భగవంతుడొక్కడే. ఎక్కడ జీవకోటి శుభాన్ని, సుఖాన్ని పొందుతుందో, అక్కడే పరమాత్మవున్నాడని మహర్షులు సెలవిచ్చారు. ప్రజలు కాశి, గయ, ప్రయాగ వంటి పుణ్యతీర్థాల్లో గ్రుంగ్రు లిడుతున్నారు. కాశి, రామేశ్వరం, మక్కా, వాటికన్ వంటి పుణ్యక్షేత్రాల్ని సందర్శిస్తున్నారు. ఏడాదిలో పండుగలు, పబ్బాలు, భజనలు జరుపుకుంటున్నారు. ఆలయాలకు వెళ్ళి పూజలు, పునస్కారాలు కావిస్తున్నారు. సాధువులకు, సన్యాసులకు యథోచిత సత్కారాలు చేస్తున్నారు. బీదలకు వస్త్రాన్న దానాలు చేస్తున్నారు. ఎందుకని? జీవుల శుభం కోసమే. ఈ చర్యలన్నీ భగవత్కైంకర్యానికి ఉద్దిష్టమైనవే అని మరువరాదు. ''మానవజాతిని ఆనందరసమనే సముద్రంలో మునకలు వేయించేవే.

భగవంతునికి రెండు రూపాలు – 1. ప్రత్యక్షం, 2. పరోక్షం. పెక్కు అవతారాలెత్తి, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయుటం ప్రత్యక్షం. దీన్నే నామ రూపాత్మకమంటాము. అవతారం ఎత్తకుండా విశ్వాన్ని శుభం వైపు నడిపించేది పరోక్షం. ఈ రెండవది తోలు బొమ్మలాట వంటిది. బండిపైన బొమ్మ లాడుతుంటాయి. కథ సాగుతూ వుంటుంది. కాని ఆడించే వ్యక్తి దిగువ తెరమరుగున దాగి నాటకం సాగిస్తాడు. భగవంతుని పరోక్ష – ఉపకారం కూడ అలాంటిదే. పరమాత్మ ఏ పద్ధతి నవలంబించినా, అది జీవకోటి శుభం కోసమే. సుఖం కోసమే. ఆయన పాలన అద్వితీయం. అందుకే ఎల్లరూ భగవంతుని పట్ల విశ్వాసం గలవాళ్ళై వుండాలి. అదే మానవాళికి నిత్య శుభదాయకం.

**"సర్వేజనాః సుఖినోభవన్తు"**

**యదార్థభారతి సౌజన్యంతో**

# గుప్త దానకర్ణుడు

## ఛక్‌ఫీనీ

అతడు అపర కుబేరుడు... గుప్త దానకర్ణుడు... వివిధ దేశాలలో విద్య, వైద్య సహాయసేవా కార్యక్రమాలకు వేలకోట్ల రూపాయలు దానంచేశాడు. కానీ ఆయన ఉండేది ఒక అద్దె ఇంటిలో... ఆయన కార్యాలయానికి వెళ్ళేది బస్సులో.... ఆయన వేసుకునే దుస్తులు అతి సామాన్యం... ఆయన పెట్టుకునే గడియారం పురాతనం... అతడే 'ఛక్ ఫీనీ'.

మనకున్నదానిని మనం ఉన్నప్పుడు ఇవ్వడంలోనే ఆనందం ఉంది. దీనినే giving while living అని అంటాడు ఛక్‌ఫీనీ. అనడమే కాదు ఆచరించి చూపాడు. తాను సంపాదించిన ఎనిమిది బిలియన్ డాలర్లను ధార్మిక కార్యక్రమాలకు రహస్యంగా వినియోగించి... రెండుగదుల అద్దె ఇంట్లో ఇప్పుడు సాన్ ఫ్రాన్సిస్కోలో నివసిస్తున్నాడు ఛక్‌ఫీనీ. ఫోర్బ్సు 400 సంస్థ ఛక్‌ఫీనీని 'జేమ్స్ బాండ్ ఆఫ్ ఫిలాంత్రఫీ' అని పేర్కొని జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది.

ఐర్లాండు నుండి అమెరికాకు వలస వచ్చిన కుటుంబంలో 1931లో న్యూజెర్సీలో జన్మించాడు ఛార్లెస్ ఫ్రాన్సిస్ ఫీనీ. తల్లి నర్స్, తండ్రి ఒక ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగి. కార్నెల్ యూనివర్సిటీలో చదువుముగిసాక అమెరికన్ ఎయిర్‌ఫోర్స్ లో చేరి కొరియా యుద్ధ సమయంలో రేడియో ఆపరేటర్‌గా జపానులో కొంతకాలం పనిచేశాడు. ఫేస్ బుక్, ఆలీబాబా వంటి అగ్రగామి సంస్థలలో ప్రాథమిక దశలోనే పెట్టుబడులు పెట్టాడు. 1982లో 'అట్లాంటిక్ ఫిలాంత్రఫీ సంస్థ'ను స్థాపించాడు. ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సంస్థగా అది నేడు సేవలు అందిస్తోంది.

ఫీనీకి స్వీయ విలాసాలకు దమ్మిడీ కూడా ఖర్చు చేయడం అలవాటు లేదు. అంత సంపన్నుడైనప్పటికీ విలాసవంతమైన హోటళ్ళకు వెళ్ళేవాడు కాదు. రోడ్డు పక్కనున్న చిన్న రెస్టారెంటులో ఒక బర్గర్ తినేవాడు.

వియత్నాంలో ఆసుపత్రి భవనాలు నిర్మించడంతో పాటు ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చాడు. 1984 సరికి హెచ్.ఐ.వి. బారినపడి సౌతాఫ్రికాలో జనం విలవిలలాడేవారు. ఛక్‌ఫీనీ సహకారంతో పదిలక్షల మందికి

చికిత్స అందుబాటులోకి రావడం వలన ఆ వ్యాధి వ్యాప్తి చెందడం నిరోధించ బడింది. పాఠశాలలో విద్యాబోధనకు ఛక్‌ఫీని అత్యధిక శ్రద్ధ చూపేవాడు.

కార్నెల్ యూనివర్సిటీలో సమాజ సేవా విభాగంలో చదువుతున్న విద్యార్థులకు పూర్తి ఆర్థిక సహకారం అందించాడు. ప్రత్యేక భవన సము దాయాన్ని నిర్మించి కార్నెల్ యూనివర్సిటీకి బహూకరించాడు. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, వియత్నామ్, ఐర్లాండ్, బెర్ముడా దేశాలలో సేవా కార్యక్రమాలు ముమ్మరంగా సాగించాడు.

1996 వరకూ అజ్ఞాతంగా ఉన్న ఛక్‌ఫీనీ పేరు న్యూయార్క్ టైమ్స్ లో వచ్చిన వ్యాసంతో బయటి ప్రపంచానికి తెలిసింది. ఆ వ్యాసం చదివినవారు ఛక్‌ఫీనీ గుప్తదానానికి నిర్ఘాంత పోయారు.

'మీరు వేలకోట్ల రూపాయలను దానం చేస్తున్నారు. మీకోసం ఏమీ ఉంచుకోవాలనిపించడం లేదా?' అని ఒక విలేకరి ప్రశ్నించాడు. అందుకు ఫీనీ నవ్వుతూ ఇలా అంటాడు:

"శవం గల్లాపెట్టెను తీసుకెళ్ళదు కదా! మనం పుట్టినప్పుడు ఏమీ తీసుకు రాము, గిట్టినప్పుడు ఏమీ తీసుకు వెళ్ళలేము. మనకున్నది ఇతరులకు ఇవ్వడంలోనే నిజమైన ఆనందం ఉంది."

వారెన్ బఫెట్ 'ఛక్‌ఫీనీ జీవితాన్ని నేనూ, బిల్ గేట్స్ ఆదర్శంగా తీసు కొన్నాం. ఆయన మా ఇద్దరికే కాదు అందరికీ ఆదర్శనీయుడు' అని అంటాడు.

ఐర్లాండులోని తొమ్మిది యూని వర్సిటీలు ఛక్‌ఫీనికి గౌరవ డాక్టరేట్‌ను బహూకరించి సత్కరించాయి. మరెవరికీ ఇంతటి గౌరవం ఇంతవరకూ దక్కలేదు. 'The Billionaire who was not' పేరుతో కానర్ ఓక్లే ఛక్‌ఫీని బయోగ్రఫీని పుస్తకం రూపంలో ప్రచురించాడు.

"నా చిన్నతనంలో మా అమ్మ నర్సుగా అంకితభావంతో సేవలు చేయడం నా జీవితంపై ఎంతో ప్రభావం చూపింది. డేల్ కార్నెగీ రచించిన 'వెల్త్' పుస్తకం కూడా నన్ను ప్రభావితం చేసింది" అంటాడు ఛక్‌ఫీనీ. ఏడాది పొడవునా ప్రతిరోజూ మిలియన్ డాలర్లను ఖర్చుచేసి ధార్మిక కార్యక్రమాలను నిర్వహించగలిగే స్థితిలో నేడు అట్లాంటిక్ ధార్మిక సంస్థవుంది.

'ఇతరుల కోసం జీవిస్తున్నవారే నిజంగా జీవిస్తున్నవారు' అనే స్వామి వివేకానంద సందేశాన్ని ఆచరణాత్మకం చేస్తున్న ఛక్‌ఫీనీ ధన్యజీవి, స్ఫూర్తిప్రదాత!

**– శ్రీరామకృష్ణప్రభ సౌజన్యంతో**

# 'ఓం నమో భగవతే వాసుదేవాయ'

**సేకరణ : బండారు భాగ్యలక్ష్మి, నరసాపురం**
సెల్ : 9963893525

**శ్రీ భగవానువాచ:**
**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా**
**నిరాశీర్నిర్మమో భూత్వాయుధ్యస్య విగతజరః** (అ.3, శ్లో.30)

**తాత్పర్యము:** సమస్త కర్మములను నా యందు ఆధ్యాత్మ చిత్తముతో సమర్పించి, ఆశగాని, మమకారము గాని లేనివాడవై నిశ్చింతగ యుద్ధము జేయుము.

**వ్యాఖ్య :** జనులలో చాలామంది యొక్క చిత్తము ప్రాపంచిక భావములతో, దృశ్య వికారములతో నిండియుండును. దైవమునకు, పరమాత్మకు అచ్చట చోటు దొరకుట దుస్తరము. అది ఆధ్యాత్మ చిత్తము కాదు. అది ప్రాపంచిక చిత్తము. ప్రతివాడును ఆధ్యాత్మ చిత్తము కలిగి యుండవలెనని భగవానుడు ఆనతి నిచ్చుచున్నాడు. ఆత్మజ్ఞానము చేతను పరమార్థ చింతనలచేతను చిత్తము నిండియుండి నిరతిశయ భక్తి భావ సమన్వితమై యుండవలెను. అదియే ఆధ్యాత్మ చిత్తము అట్టి పవిత్ర మానసముతో గూడుకొని సమస్త కర్మలను భగవదర్పణము గావింపవలెనని ఇటు బోధింపబడినది. సర్వాణి కర్మాణి అని చెప్పుటవలన, ఒకటి రెండు కర్మలు కాదనియు, తాను చేయు సమస్త కార్యములను ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరింపవలెనని విదితమగుచున్నది.

**"నిరాశా, నిర్మమః" :** ఆశ, మమకారము పారద్రోలవలెనని హెచ్చరింపబడినది. ఈ ప్రపంచమున భగవంతుడు (ఆత్మ) అను ఒక వస్తువు తప్ప విజ్ఞునకు వాంఛింపదగినది మరియొకటి యేదియును లేదు. ఆత్మ ఒక్కటియే సత్యమైనది. దృశ్య ప్రపంచ మంతయు దాని ప్రతిబింబ రూపము, కల్పితము, నశ్వరము. అట్టి కల్పిత, మిథ్యాప్రపంచమున వివేకవంతు డగువాడు ఏ పదార్థమందైన ఆశగాని, మమకారము గాని యెట్లుంచగలడు ? కావున ఇట్టి విచారణ ద్వారా ఆశను, మమకారమును లేకుండా చేసుకుని మనుజుడు అట్టి పవిత్ర భగవదర్పిత చిత్తముతో తన విధ్యుక్త కర్మలనాచరించ వలయును అని అర్జునుని నెపమున లోకమునకు అంతటికి బోధింపబడినది. అర్జునుడు క్షత్రియుడు కావున

'యుధ్యస్వ' (యుద్ధము చేయుము) అని చెప్పబడినది. తక్కిన వారు వారివారి సాంప్రదాయోచిత కార్యములను ఈశ్వరార్పణ బుద్ధితో, పైన దెల్పిన ఆధ్యాత్మగుణములతో గూడి యాచరించవచ్చును. దీనిని బట్టి గృహస్థాశ్రమములోనున్న వారు కూడ తరించుటకు అవకాశము ఏర్పడు చున్నది.

**"విగతజ్వరః"** : 'సంతాప రహితుడవై యుద్ధము చేయుము' అని భగవానుడు సెలవిచ్చెను. జ్వరములు రెండు రకములు 1. బాహ్యజ్వరము 2. మానసికజ్వరము. రెండును జీవుని బాధించుచున్నవి. శారీరక జ్వరము ఔషధముతో నివారితమగుచున్నది. మానసిక జ్వరము, (భవరోగము, సంసారతాపము) చల్లారుటకు భగవానుడు ఈ శ్లోకమున చక్కని ఔషధములను నాల్గింటిని తెలియ జేసెను. అవియేవి యనిన 1. ఆధ్యాత్మిక చిత్తము కలిగియుండవలెను (ఆత్మ యందు దైవమందు సంలగ్నమైన చిత్తము గలవారై యుండవలెనని భావము). 2. అట్టి నిర్మల చిత్తముతో గూడుకొని సమస్త కర్మములను, వాని ఫలితములను భగవంతునికి అర్పణ చేయవలెను (పాపకర్మములు చేయ రాదు). 3. ఆశ వదలవలెను. 4. మమకారము లేకుండవలెను.

ఈ నాల్గను 'రామ బాణ' దివ్యౌషధములు. భవరోగ భేషజములు. వీనిని చక్కగ సేవించినచో మనుజుడు 'విగతజ్వరుడు' కాగలడు 'గత' అని చెప్పక 'విగత' అని చెప్పుటవలన జ్వరము పూర్తిగా తొలగగలదని అర్థము. ఎంతటి దేహారోగ్యము కలిగి యున్నప్పటికిని, జనన మరణరూప ఘోర సంసార ప్రవాహమున బడవేసి అనేక గర్భ నరకములందు జీవుని త్రోసివేయునట్టి ఈ లోపలి జ్వరము అంతమొందనిచో మహాప్రమాదము వాటిల్లును. కావున భగవానుడు తెలిపిన ఈ నాలుగు దివ్యౌషధములను లెస్సగ సేవించి విగత సంసార జ్వరుడై దైవార్పిత చిత్తముతో ఆనందముగ తన కార్యములను చేయుచుండులాగున శ్రీకృష్ణమూర్తి కరుణతో ఇచ్చట బోధించుచున్నాడు.

**శ్రీభగవానువాచ:**

**ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్** (అ.3, శ్లో.43)

**తాత్పర్యము:** గొప్ప బాహువులు గల ఓ అర్జునా! ఈ ప్రకారముగా

బుద్ధికంటె అతీతమైన దానినిగా ఆత్మనెరిగి వివేకముతో కూడిన బుద్ధితో మనస్సును, బాగుగ అరికట్టి, జయించుటకు కష్టసాధ్యమైనట్టి ఈ కామమను శత్రువును నశింపజేయుము.

**వ్యాఖ్య:** ప్రపంచములోని దుఃఖమంతటికిని కారణము జీవుడు తన నిజస్వరూపమును తెలిసికొనక యుండుటయే. తాను దేహమని, ఇంద్రియములు అని, మనస్సని యను కొనుచు దుఃఖించుచున్నాడు. ఈ దేహాదిరూప దృశ్యతాదాత్మ్యమే అశాంతికి దుఃఖమునకు మూలము! కాని భగవాను డిచ్చట యదార్థ తత్త్వమును బోధించుచు, 'ఓ జీవుడా! నీవు బుద్ధి కంటెను పరమైనట్టి, ఆత్మవే కానీ దేహాదులు కావు. అట్టి ఆత్మ స్థానమున నిలకడపొంది జయింప దుస్సాధ్యమగు ఈ కామమను శత్రువును నశింపజేసి పరమానంద మొందుము' అని కరుణతో బోధించుచున్నాడు. దేహము నకు, ఇంద్రియములకు, మనస్సునకు వాస్తవముగ చైతన్యము కల్పించుచున్నది ఆత్మయే. ఆత్మ నుండియే అవి శక్తిని గ్రహించుచున్నవి. కాని అవియే కాలక్రమమున ఆత్మను మరుగుపరచి తామే పైకివచ్చి కూర్చున్నవి. జీవుని అజ్ఞానమే దీనికి కారణము. ఆత్మను విస్మరించుటయే దీనికి హేతువు. కావున ఇపుడు విచారణ చేతను, మహనీయుల బోధనల చేతను తన యదార్థ స్వరూపమును (ఆత్మ) తిరిగి జ్ఞప్తికి తెచ్చు కొనినచో ఆ దేహేంద్రి యాదులన్నియు అణిగి యుండును, కాబట్టి భగవానుడు ఈ శ్లోకమున కామ జయమునకు, బంధ రాహిత్యమునకు ఆత్మజ్ఞానమొక్కటియే పరమ శరణ్యమని తెలుపుచున్నాడు. దేహేంద్రియాది సంఘాతమున కంతకును వ్యవహారమును కల్పించు చున్న ఏ అభ్యాసము, ఆత్మతోటి దృశ్య సంగము కలదో, ఆ సంగమును, గ్రంధిని, వివేకమను శస్త్రముతో చేధించి వైచినచో ఇక ఇంద్రియాదు లన్నియు దుర్బలములై నిర్వీర్యములై పోవును. దీనినే గ్రంధివిచ్ఛేదన మందురు. అజ్ఞాని ఈ దేహేంద్రియాది దృశ్యజాత మంతటితో తన్ను ముడి వేసికొనును. జ్ఞాని ఆ ముడిని ఊడదీసి తననుండి (ఆత్మనుండి) దానిని వేఱు పరచుకొనును. అపుడే ఇంద్రియాదు లన్నియు ఉన్నను జీవుని ఏ మాత్రము బాధింపనేరవు. అవి యాతనికి లొంగిపడియుండును. ఇదియే వేదాంత మందలి పరమ రహస్యము. ఒక్కొక్క

ఇంద్రియమును, ఒక్కొక్క దృశ్య వస్తువును పట్టుకుని లొంగదీసుకొనుట కంటే, సమస్తమునకు మూలమగు ఆత్మస్థానమును జేరినచో, ఒక ఇంద్రియములేల, మనస్సేల, బుద్ధియేల, సమస్త దృశ్యము కూడ వశమై పోవును. సంసార దుఃఖమంతయు శమించుటకు ఇది సులభోపాయము. ఈ సంసార చక్రభ్రమణ మంతయు, ఈ అనాది దుః ఖజాతలమంతయు ఇతరమగు ఏ ప్రక్రియ చేతను లొంగదు. దృశ్యముతోటి ఆత్మయొక్క సంగమును ఛేదించివైచినచో చాలును అది అంతయు ఆగిపోవును. ఆత్మస్వరూప విజ్ఞానమొకదానిచేతనే తత్ఫలితము చేకూరగలదు. తత్త్వ జ్ఞానముచే వాసనాక్షయము తప్పక కలుగగలదని ఘంటాపదముగా భగవానుడు తెలుపుచున్నాడు. 'దురాసదమ్' కామమను శత్రువు మహా శక్తివంతమైనదనియు, జయించుటకు కష్టసాధ్యమైనదనియు చెప్పబడినది. మహా వటవృక్షము వేళ్ళుతన్నుకొని దృఢముగ ఉన్నట్లు, పెక్కు జన్మలందు బలమును సంపాదించుకుని కామము హృదయక్షేత్రమున చక్కగ నిలద్రొక్కు కున్నది. కామరూప మహాపాపము అనంగమును (ఆత్మజ్ఞానమును) గండ్రగొడ్డలిచే ఛేదింపశక్యమగును. కాబట్టి శోకసాగరమును తరింపదలుచు వారు కామాది శత్రువులను జయింప దలంచుతారు, మోక్షపదవిని కాంక్షించు వారు, తాము దేహేంద్రి యాదులని భావింపక, వానియన్నిటికి సాక్షియగు ఆత్మయే తామని ధృడముగ నిశ్చయించుకొనవలెను. అట్టి నిశ్చయము కల్గియున్నచో ఇకనిండు యౌవనమందు ఉన్నప్పటికిని, ప్రపంచ మధ్యమున మెలగుచున్నప్పటికిని, ఇంద్రియములు అదుపులోనే యుండును. కామాదులను జయించు టకు ఆత్మజ్ఞానము గొప్పసాధనమని భగవానుడు భోధించెను. నిష్కామ కర్మాచరణ ద్వారా చిత్తశుద్ధినిపొంది, తద్వారా దృద్దృశ్య వివేకరూపమగు ఈ ఆత్మజ్ఞానమును తప్పక పొందవలసి యుందురని స్పష్టము చేయబడినట్లేనట.

**(సశేషము)**

*(గీతామకరంద రచయిత శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి నిత్యస్మరణీయ గీతావాక్యములు కొన్ని యధాతథంగా.)*

# "నేను" .... ఎవరు ?

– **శ్రీ గెంటేల వెంకటరమణ,** బలుసుపాడు

మహాత్ముల బోధ ఎప్పుడూ అంతిమ సత్యాన్ని గురించే ఉంటుంది. వారి బోధల్లో నిరంతరం మన మనస్సులో సత్యాన్ని ఆవిష్కరించాలనే ప్రేమభావమే ఉంటుంది. ఎందుకంటే సత్య దూరమైన మనసు దుఃఖహేతువుగా మారుతుంది. చేప చిన్న ఎర కోసం గాలానికి చిక్కుకున్నట్లు ఉదయం లేచింది మొదలు మనంకూడా ఏదో ఒక చిన్న సంతోషం కోసం దుఃఖానికి చిక్కు కుంటూనే ఉన్నాం. సుఖం మీద ఇష్టంచేత దుఃఖాన్ని మనం గుర్తించకపోవచ్చు. కానీ ఏ సుఖమైనా శాశ్వతంగా కొనసాగదు కనుక అది అదృశ్యం కాగానే మళ్లీ దుఃఖంలోనే ఉంటాము. సుఖానికి ఆద్యంతాల్లో దుఃఖమే ఉందన్న విషయాన్ని గుర్తిస్తే దానికి పరిష్కారం ఏమిటని అన్వేషిస్తాము. సత్యం తెలియడవే దుఃఖానికి శాశ్వత పరిష్కారం. సత్యం అంటే ఏది నిలిచి ఉండేదో, ఏది నిలిచి ఉండనిదో, ఏది నిజమైన అనుభవమో, ఏది భ్రమో మనసుకు స్పష్టంగా తెలియడం. ఉన్న విషయం ఉన్నట్లుగా తెలిస్తే లేనిదానికోసం పాకులాట, వెంపర్లాటలు ఉండవు. సుఖంమోజులో దుఃఖాన్ని గుర్తించకుండా భరిస్తున్నంత కాలం అసలు సత్యాన్ని తెలుసుకోవాలన్న ఆలోచనే రాదు. సత్యం ఒకటి ఉంటుందన్న పరిజ్ఞానం కూడా కలగదు. సత్యం తెలియకపోయినా అనునిత్యం ఏర్పడే దుఃఖం పోతూనే ఉంది... కానీ అది తాత్కాలికం మాత్రమే... సత్యం తెలిస్తే శాశ్వతంగా శాంతి ఉంటుంది. సత్యం తెలియనంత కాలం తాత్కాలిక సుఖం, సుదీర్ఘమైన దుఃఖమే ఉంటాయి. జీవితంలో అనునిత్యం కలిగే అనుభవాల్లో మునిగి పోకుండా కొద్దిగా జీవితాన్ని పరికిస్తే ఈ సత్యం తెలుస్తుంది. మనకి అనుభవాల విషయంలో ఏర్పడే అనుకూలత సుఖంగా, ప్రతికూలత దుఃఖంగా అనిపిస్తుంది. కానీ మనసులో సత్యం ఆవిష్కృతం అయితే అనుకూలత, ప్రతికూలత రెండూ ఉండవు. అప్పుడు సుఖదుఃఖాలకు అతీతమైన శాంతి వెల్లివిరుస్తుంది. మనసులో సత్యం అనే కాంతి ప్రసరించేవరకూ దుఃఖం అనే చీకటి వెంటాడుతూనే ఉంటుంది. మధ్యమధ్య సుఖం అనే తాత్కాలిక విరామం ఉన్నా సత్యం తెలియని జీవితం దుఃఖపూరితంగా కొనసాగుతుంది. దుఃఖం రోజు రోజు రూపాలు మార్చుకుంటుంది

కానీ మనని వీడి వెళ్లదు. ఒకరోజు అనారోగ్యం, మరో రోజు అవమానం, ఇంకోరోజు అసౌకర్యం... ఇలా విభిన్న రూపాల్లో దుఃఖం మనను వెంటాడుతూనే ఉంటుంది.

మరి దుఃఖాన్ని హరించే పరమ సత్యం ఏమిటి అంటే "నేను భగవత్ స్వరూపాన్ని" అని స్పష్టంగా తెలియడం. ఇప్పుడు నేను మనిషిని అని ఎంత స్పష్టంగా తెలుస్తుందో అంత స్పష్టంగా తెలియడం. భగవత్ స్వరూపులమైన మనకు దుఃఖమే లేదని తెలియడమే శాశ్వత పరిష్కారం అవుతుంది. ఇప్పుడు అనుభవాలను, అనుభూతులను, సుఖ దుఃఖాలను, ఆశ నిరాశలను కలిగించేది మొత్తం మనసు రూపంలో మనని ఆవరించి ఉన్న ఒకానొక చైతన్య ప్రక్రియ మాత్రమే అని తెలుస్తుంది. మనసు కేవలం మనం వేసుకున్న వస్త్రం లాంటిదే అని తెలిస్తే దాని సమస్త క్రియలతో దైవస్వరూపమైన మనం భిన్నంగానే ఉన్నామని తెలుస్తుంది. అలా తెలుసుకోవడానికి సులభమైన జ్ఞానమార్గం విచారణ. మనందరిలో సమానంగా వ్యాపించి ఉన్న నేనున్నాను అన్న తొలిభావం వైపు మనసును తిప్పటమే విచారణ. "నేనున్నాను అన్న ఎరుక వల్లనే సంతోషం, దుఃఖం తెలుస్తున్నాయి. నేనెవరో తెలిస్తే రెండూ పోతాయి." నేనున్నాను అన్న భావం ఏర్పడక ముందు కూడా మనం ఉన్నాము. కానీ నేను అనే ఒక ప్రత్యేక వ్యక్తిత్వ భావన లేకుండా కేవలం ఎరుకగా ఉంది. అది తెలుసు కోవడమే నేనెవరో తెలుసుకోవడమంటే. ముందు నేనున్నాను అన్న మూలభావం మనకు అర్థమైతే, భావాతీతమైన అసలు నేను ఆవిష్కృతం అవుతుంది. అది మనంగా తెలుసుకునేది కాదు. నేనున్నాను అన్న తొలిభావంగా మనం ఉంటే నేనులేని ఎరుక తెలియబడుతుంది. ఎప్పుడైతే మన స్వస్వరూపం, మనసు స్వరూపం రెండూ వేరువేరుగా స్పష్టంగా అర్థం ఆయ్యాయో.... జీవనం అంతా మనసుదే అని అర్థం అవుతుంది. ఆ మనసును నడిపే ఎరుకను నేను అని అర్థం అవుతుంది. వాహనం నడిపే వ్యక్తికి ఆ వాహనానికి అంటుకునే దుమ్ముతో, వాహనం నుండి వచ్చే పొగతో సంబంధం లేనట్లే మన చైతన్యం చేసే క్రియా కలాపాలకు మనకూ ఏ సంబంధం లేదని స్పష్టంగా తెలిసిన తర్వాత సుఖదుఃఖాలను ప్రత్యేకంగా అనుభవించే వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. ఇప్పుడు మనం అనుకుంటున్న మన స్వరూపం రూపంతో, నామంతో, పరిమితులతో, ఇష్టా ఇష్టాలతో, సుఖదుఖాలతో అహంకార పూరితంగా ఉంది. మన నిజస్వరూపం తెలిస్తే అప్పుడు అది ఎలా నిర్వికారంగా, నిరామయంగా, నిరహంకారంగా, నిర్మలంగా ఉందో అర్థమౌతుంది. అప్పుడు అనుభవాలకు నేను సాక్షినేగానీ, అనుభవాలు నావి కావు అని తెలుస్తుంది. మనసుకు కలిగే సుఖఃదుఃఖాలు నాకు తెలియబడుతున్నాయే కానీ నన్ను ప్రభావితం చేయడం లేదని తెలుస్తుంది. తెలియడంగా మనం ఉంటే జీవితం అంతా కేవలం తెలియబడే దృశ్యంగా

సాగిపోతుంది. తనను ఆధారంగా చేసుకొని నడిచే సినిమాతో తెరకు ఎలాంటి సంబంధం ఉంటుందో మనం జీవితానికి మన స్వస్వరూపానికి అలాంటి సంబంధమే ఉంటుంది. ఇప్పుడు మనకి మనం దేహంగా తెలుస్తున్నాం. ఆలోచనగా ఉన్నప్పుడు మనసుగా ఉంటున్నాం. కానీ నిజానికి మనం రెంటికీ అతీతమైన ఎరుకగా ఉన్నామన్న సత్యం తెలుసుకోవడానికే ఆధ్యాత్మిక బోధ అంతా. విద్య కారణమైన దాని మీద ధ్యాస పెడితే క్రియాకలాపాలు పెద్దగా ప్రభావం చూపించవు. అలానే మనలో ఎరుకగా ఉన్న పరమాత్మపై ధ్యాస పెడితే ప్రపంచం మనను ప్రభావితం చేయదు. ఇది గుర్తుచేయడానికే మహాత్ములు గురువులుగా అవతరించి జ్ఞాన బోధ చేస్తారు. సత్యం ఆవిష్కృతమైతే మనలోని బ్రహ్మం తెలిసి, ప్రపంచంపై ఉన్న భ్రమలు తొలగి పోతాయి. అసలు కనిపించే ప్రపంచం, దృశ్యాలు, జీవితం అంతా ఆ భ్రమలో భాగమేనని తెలిస్తే సినిమాను వినోదించినట్లుగా జీవితాన్ని అన్ని భావాలు, భావోద్వేగాలతో కలిపి వినోదిస్తూ సాగిస్తాము. సినిమాలో దృశ్యాలు నవ్వు తెప్పిస్తాయి, ఏడుపు తెప్పిస్తాయి, కోపం తెప్పిస్తాయి, ఇలా రకరకాల భావాలు, భావోద్వేగాలు కలిగిస్తాయి. కానీ అవి నావి కావు అన్న స్పష్టత చేత మనసుపై ప్రభావాన్ని చూపవు, జ్ఞాపకంగా నిలిచి ఉండవు. సత్యం అర్థమైన మనసునకు జీవితం కూడా అలా ఉంటుంది. అందుకే జ్ఞాని మనలాగానే జీవిస్తున్నట్లు కనిపిస్తారు. వచ్చిందాన్ని దేన్నీ తిరస్కరించరు, లేనిది కాంక్షించరు.

కానీ దేనిని కూడా తనవిగా మనసుతో స్వీకరించరు. అత్యంత ఉత్కృష్టమైన ఈ స్థితి అందరికీ సాధ్యమైనదిగానే ఉన్నా ప్రపంచ ఆకర్షణ మనసును వెనక్కి తిరిగి తన స్వరూపం తనను చూసుకో నివ్వదు. అందుకే సద్గురువులు, సత్పురుషులు శుభేచ్ఛను ఆధ్యాత్మికతకు తొలిబీజంగా నాటతారు. వాళ్లు జీవితాన్ని, ప్రపంచాన్ని తిరస్కరించమని చెప్పరు అధిగమించమని చెప్తారు. పడవలో ప్రయాణించే వాడు నదిని తిరస్కరించడు... అధిగమిస్తాడు. ఇది కూడా అంతే మనసులో శుభేచ్ఛద్వారా సత్యం వైపు వెళ్తూ ఉంటే జీవితం ఏమీ మారదు. జీవితం ఎడల మన దృష్టి, దృక్పథం మారతాయి. అవే మనను పరమశాంతికి అర్హులను చేస్తాయి.

జ్ఞాన బోధ ఎంతో విలువైనది. అది జ్ఞానుల సమక్షం లోనో, వారి మాటలద్వారానో లభ్యమౌతుంది. అది ఎక్కడ లభించినా వదిలిపెట్టకుండా పట్టుకునేంత శుభేచ్ఛ కలగాలి. ఇది పురాణ ఇతిహాసాల్లాగా జ్ఞాపకం పెట్టుకునే విజ్ఞానం కాదు. పురాణ ఇతిహాసాలకు కూడా సారంగా నిలిచే జ్ఞానం అది. అంత గొప్ప జ్ఞానాన్ని కూడా

మనకు సులభ సాధ్యం చేయడమే సద్గురువులకు మనపై ఉండే అనుగ్రహం. సత్యం తెలుసుకునేదే కానీ పొందేది కాదు. అంటే మనకు దూరంగా ఉండి సాధించాల్సింది, చేరుకోవాల్సింది కాదు. మనలోనే ఉండి మనం మర్చిపోయింది. అందుకు గురువు మనకు జ్ఞానాన్ని అందించరు, నేర్పించరు కేవలం తమ బోధతో మర్చిపోయిన దాన్ని గుర్తుచేస్తారు. జన్మజన్మల సంస్కారం చేత నేను మనిషిని, నేను మనసుని, నేను దేహాన్ని అని స్థిరంగా ఏర్పడిన భావాలను తమ బోధలతో తొలగించి లోపల ఉన్న సత్యాన్ని అనుభవైకవేద్యం చేస్తారు. గురువు బోధ మనకు అనుభవంలోకి రావడం కోసం మనం పాటించాల్సినవి నియమ నిబంధనలు కావు. మార్గదర్శక సూత్రాలు. వినయంతో మనసు సంపాదించుకునే నిరాడంబరం, నిరంహంకారం, నిష్కామం, నిష్కల్మషం వంటి సద్గుణాలు మార్గదర్శకాలుగా నిలిచి సత్యానికి మనను చేరువ చేస్తాయి. మనలోని సత్యాన్ని వ్యక్తంచేస్తాయి. సత్యంలో మనని మునిగిపోయేలా చేస్తాయి. సంపూర్ణ జ్ఞానం లభించిన మహానుభావులకు అంతా సత్యమే కనిపిస్తుంది. అంటే ఉన్నది ఉన్నట్లుగా, లేనిది లేనట్లుగా, నిలిచి ఉండేదాని శాశ్వతత్వం, నిలిచిఉండని దాని అశాశ్వతత్వం కదలని దాని స్థిరతత్వం, కదిలి పోయే దాని చరతత్వం అన్నీ కలిసి తెలియడమే సత్యం తెలియడం. సత్యం అంటే మనం తెలుసుకునే ఒక వస్తువు కాదు. మనకి అన్నింటినీ తెలియజేసే ఒక వెలుగు. అందుకే జ్ఞానం అంటే సత్యాన్ని తెలుసుకోవడం అనడం కన్నా, సత్యంతో ప్రపంచాన్ని, జీవితాన్ని తెలుసుకోవడం అనవచ్చు. ఈ సృష్టి అంతా సత్యమే నిండి ఉంది. మనం కూడా అందులో భాగమే. ఇప్పుడున్న పరిమిత దృష్టికి ఇది అర్థంకాదు. శుభేచ్ఛతో దృష్టి, దృక్పథం మారినప్పుడే ఇవన్నీ అర్థం అవుతాయి. సత్సంగాలు విన్నా, సద్గ్రంథాలు చదివినా శుభేచ్ఛ లేకపోతే అవి కేవలం భౌతిక కార్య కలాపాల వ్యక్తీకరణే అవుతుంది.

ఆధ్యాత్మిక సాధనలో చేసే ధ్యానప్రక్రియ కూడా మన స్వస్వరూపం తెలుసుకోవడానికే. ఆలోచనలు అల వాటైన మనసుకు వాటినుండి విరామాన్ని కలిగించేందుకు ధ్యానాన్ని ఒక ప్రక్రియగా ప్రారంభించినా అంతిమంగా తెలియాల్సిన విషయం మనసు ఆలోచనలకు అతీతంగా ఉందని. ధ్యానం ద్వారా ఈ సత్యం ఆవిష్కరణ జరిగినప్పుడే ఆలోచనలు కొనసాగుతున్నా అంతరంగంలో ఉన్న ధ్యానాన్ని మనం అనుభవించ గలుగుతాము. ధ్యానం మనసుకు ఈ మెళకువ నేర్పేది కావాలే కానీ ఆలోచనలను తప్పించుకునే పలాయన ప్రక్రియ కాకూడదు. అప్పుడు జీవనం సాగుతున్నా సహజ ధ్యానం జరుగుతూనే ఉంటుంది. కార్యకలాపాల్లో ఉన్నప్పుడు

చురుగ్గా ఉంటుంది. ఏ వ్యాపకం కార్యకలాపం లేనప్పుడు మనసు సహజ సమాధిస్థితిలో - అన్నింటినుండి ఉపసంహరించుకుంటుంది. ప్రపంచం పైనా, ప్రాపంచిక ఫలాలపైనా ఆసక్తి లేకుండా చేసే కార్యాలు మరింత సున్నితంగా, సుందరంగా సాగుతాయి. అందుకే జ్ఞానుల జీవన గమనం ఎంతో మనోహరంగా ఉంటుంది.

నేను లేకపోతే ఇక నాకు ఏర్పడే కష్టసుఖాలకు విలువ ఎక్కడిది? అదే అద్వైతబోధ. అదే జ్ఞానబోధ, అసలు మనంచేసే కార్యకలాపాలే మనవి కానప్పుడు ఇక వాటి వల్ల కలిగే ఫలితాలు కానీ, పాపపుణ్యాలు కానీ మనవి ఎలా అవుతాయి. కార్యకలాపాలు చేసే దేహం కేవలం పనిముట్టు మాత్రమే. కార్యకలాపాలు చేసేందుకు లభించే శక్తి మన స్వస్వరూపంగా ఉన్న పరమాత్మది. ఇక పాపపుణ్యాలు ఎవరికీ అంటే తాను పరమాత్మని అని మర్చి పోయి దేహంగా భావించే మనసుకు. నేను దేహాన్ని అన్నది భావమే తప్ప నిజం కాదు. నేను పరమాత్మని అన్నది సత్యం కనుక భావంతో పనిలేదు. కాబట్టి క్రియాకలాపాలు, పాపపుణ్యాలు, మంచి చెడులు అన్నీ కేవలం భావానివే కానీ దేహానివి కాదు, దైవానివి కూడా కాదు. దైవంగా ఉన్న మనను ఆశ్రయించుకొని ఏర్పడే భావమే మనసుగా మారి ఆలోచనలు, సంకల్పాలు, ఆశలు, ఆశయాలు, సాధన వంటి ప్రక్రియలన్నింటికీ కారణంగా నిలుస్తుంది. నేను మంచి పనులు చేశాను, నేను చెడ్డపనులు చేశాను అన్న భావన సత్యదూరమే. ఎందుకంటే నిద్ర, ఆకలి, ఆహారం, అరగడం ఏదీ మనంగా చేయడంలేదు. మన ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా అవి జరిగి పోతున్నాయి. అవి కావాలంటే తెచ్చు కోలేము. వద్దంటే ఆపుకోలేము కాబట్టి వాటి విషయంలో మనకు కర్తృత్వం లేదు. వీటి విషయంలో ఎలా కర్తృత్వం లేకుండా ఉంటామో, అన్ని కార్యకలాపాలు మనవి కాదు అని గుర్తిస్తే అలా మనసు భారం లేకుండా సాగుతుంది. - జ్ఞాన బోధ అంతా మనవేమిటో మనని తెలుసుకోమని చెప్తుంది. అప్పుడే పుట్టిన పసికందు ఉంటుంది కానీ తాను దేహాన్నని, మనసునని అనుకోదు. పెరిగే కొద్దీ తన దేహం, తన మనసు తెలుసు కుంటూ ఎదిగి తాను మనోదేహాలను అనే భావంతో పెరుగుతుంది. తెలుసుకునే జ్ఞానం కలిగి ఉన్న మనం "నేను దేహం" అనుకోక ముందు ఎవరిగా ఉన్నామో, "నేను మనసుని" అనుకోక ముందు ఎవరిగా ఉన్నామో, "నేను ఫలానా" అనుకోకముందు ఎవరిగా ఉన్నామో, ఏ గుర్తింపు లేక ముందు ఎవరిగా ఉన్నామో ఒక్కసారి విచారణ చేసి తెలుసుకోవచ్చు. ఎదుటి వారితో వాదిస్తే తర్కం అవుతుంది. మనతో మనమే వాదించు కుంటూ వెళ్తే అది విచారణ అవుతుంది. విచారణ బాగా

సాగా లంటే మనసుకు వ్యాపకాలు తగ్గాలి. వ్యాపకాల్లో ఉన్న మనసు వాటి వెంట పరుగెత్తి తన స్వస్వరూపం చూసుకోదు. అందుకే మన స్వరూపం ఎరుక అని స్పష్టంగా తెలిసే వరకూ మహాత్ముల మార్గదర్శకాలను చిత్త శుద్ధితో పాటించాలి. దాన్నే శ్రద్ధాభక్తులు అంటారు. మహాత్ముల సాంగత్యంలో మనకు తెలియకుండానే మనో నాశనం జరుగుతుంది. మనోభావన పోయిన చైతన్యం ఆత్మభావనతో ఉండిపోతుంది. ప్రపంచం ఒకటి ఉంది కాబట్టి మనకు తెలియబడుతుంది అనుకుంటున్నాము. అది నిజం కాదు. నీవున్నావు కాబట్టి ప్రపంచం తెలుస్తుంది అన్నది నిజం. మనలోనే ఉన్న ప్రకాశం వల్లనే మనకు ప్రపంచం తెలుస్తుంది. ఆ ప్రకాశం తనను తాను తెలుసుకుంటే ఆత్మజ్ఞానం అవుతుంది. నిన్ను నీకు తెలియజేసే వికాసం, ప్రపంచాన్ని తెలియజేసే వికాసం ఒక్కటే. సత్సంగాలు విన్నప్పుడు, చదివినప్పుడు మనసుకు అవి అర్థం అవుతాయి. వాటిని పదేపదే మననం చేయడం ద్వారా అవి బుద్ధికి కూడా విస్తరించి స్థిరమైన భావాలుగా మారి వివేకంగా పనిచేస్తాయి. అంతఃచేతనలో కూడా ఈ విషయం బలంగా నాటుకుంటే తప్ప సత్యం సంపూర్ణంగా ఆకళింపు కాదు. అది బయటి విషయాల్లాగా అనుభవంతో తెలిసేదికాదు. మనసుకు ఏర్పడే అవగాహనతో దానంతట అదిగా తెలియబడేదే సత్యం.

**సుపథ సౌజన్యంతో**

## శ్రద్ధాంజలి



ఆనంద దివ్యజ్ఞానసమాజం తాడేపల్లిగూడెం పూర్వాధ్యక్షులు శ్రీ గంధం భుజంగరావుగారు (డి.నెం.34227) ఫిబ్రవరి 1, 2020 శనివారం పరమపదించారు. వీరి వయస్సు 81 సంవత్సరాలు. వృత్తిరీత్యా వీరు కళాశాల ప్రిన్సిపాల్ అనిబెసెంట్ రచించిన Search for Happiness, pain its meaning and use, liberation అను పుస్తకములను సుఖము, బాధా, విముక్తి అను పేరున తెలుగులోకి అనువదించారు. అలాగే జిడ్డు కృష్ణమూర్తి తత్వంపైన నాలుగు పుస్తకములు రచించారు. వీరి మృతికి సంతాపం తెలుపుతూ దీపిక శ్రద్ధాంజలి తెలుపుతున్నది.

# “ప్రభూ! నాకేమి కావాలో నీకే బాగా తెలుసు!

పంచతంత్రంలోని కథ ఇది... ఒక చిన్న కొలను ఉంది. అందులో చాలా కప్పలు ఉంటున్నాయి. అవన్నీ కలసి ఒకరోజు సమావేశమై, “మనం ఎన్నో తరాలుగా ఇక్కడ ఉంటున్నాం. ఎప్పుడూ ఓ నాలుగు పురుగులు తినడం, గట్టుమీద నుంచి నీటిలోకి, నీటిలో నుంచి గట్టుమీదకు దూకడంతో మన బ్రతుకు గడచిపోతోంది. మనకు ఒక రాజుగారు ఉంటే బాగుంటుంది! అప్పుడు రాజదర్బారు, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలన... ఇలా అన్నీ జరుగుతూ ఉంటే, మనకు చాలా వినోదంగా ఉంటుంది. మనకు ఓ రాజును ఇమ్మని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం. అయితే అతడు మన జాతివాడు కాకపోతే మేలు! ఎందుకంటే మన జాతివాడే అయితే అతడు మనకు లోకువైపోతాడు!” అని తీర్మానించాయి.

ఆ కప్పలు సామూహిక ప్రార్థన మొదలుపెట్టాయి. ఆ కప్పల ప్రార్థనలు విన్న దేవుడు వచ్చి, ‘ఓ భక్తులారా! ఏమి మీ కోరిక?” అని అడిగాడు. ఆ కప్పలు వాటి కోరికను తెలిపాయి. అయితే దేవుడు, ‘మీరిప్పుడు బాగానే ఉన్నారు కదా! ఎందుకు మీకీ కొత్త గోల?” అన్నాడు.

కానీ, ఆ కప్పలు వాటి పట్టు వీడలేదు. ‘సరే! మీకొక రాజును ఇస్తాను! ఇదిగో మీ రాజు!’ అంటూ ఒక పెద్ద దుంగను ఆ కొలనులో పడవేసి మాయమైపోయాడు. ఆ దుంగను చూసి కప్పలన్నీ చాలా సంతోషించాయి. కప్పలన్నీ ఆ ‘దుంగ–రాజు’ గారి చుట్టూ చేరి రాజుగారితో కబుర్లు చెప్పుకుని ఆనందించాయి. ఇక కాసేపటికి, కొన్ని పిల్ల కప్పలు రాజుగారి మీదకు ఎక్కి కూర్చున్నాయి కూడా!

అయితే, నాలుగు రోజులు గడిచేసరికి వాటికి ఆ దుంగ రాజు మరీ నిస్తేజంగా కనిపించాడు. అసంతృప్తి చెందిన కప్పలన్నీ మళ్ళీ ప్రార్థనలు మొదలుపెట్టాయి. ఈసారి దేవుడు మరింత త్వరగా ప్రత్యక్షమవ్వడం, కప్పలు ఆ దుంగ రాజు నచ్చలేదని పెదవి విరచడం చకచకా జరిగిపోయాయి. ‘మంచి పరిపాలన చేసే చురుకైన రాజును ఇవ్వండి ప్రభూ!’ అని వేడుకున్నాయి. దేవుడు వాటికి ఒక కొంగను రాజుగా ఇచ్చి వెళ్ళిపోయాడు. ఇక ఆ కొంగరాజు వాటిలో ఒక్కొక్కదాన్ని – తీరుబాటుగా పట్టుకుతింటూ ఉంటే అప్పటికిగానీ ఆ బెక మేధావులకు తామేమి తప్పు చేశామో తెలియలేదు.

మనం చేసే ప్రార్థనల గురించి స్టీఫెన్ క్రాఫ్ట్ ఇలా అంటాడు: "ప్రార్థనలు మనం దేవుడికి పెట్టుకునే దరఖాస్తులు. అయితే, మన ప్రార్థనల మీద భగవంతుడికి పూర్తి సంపాదక హక్కులు ఉంటాయి. ఆయన మన ప్రార్థనల్ని తగ్గిస్తాడు, సరిచేస్తాడు, తన సంకల్పానికి తగినట్లుగా వాటిలో మార్పులుచేసి, మన చేతికిచ్చి మళ్ళీ దరఖాస్తు చెయ్యమంటాడు." అలా కాకపోతే గొంతెమ్మ కోరికలతో మన వినాశనాన్ని మనమే కొనితెచ్చుకున్న వారమవుతాం.

మనం రోజంతా చేసే ఆలోచనలే మన ప్రార్థనల రూపంలో బయటికి వస్తాయి. కాబట్టి మన ప్రవర్తన ఎలా ఉంటుందన్న విషయంలో నిరంతరం జాగ్రత్తగా ఉండాలి. ఇక, మన ప్రార్థనలన్నీ ఫలవంతమవుతాయా అని అడిగితే కావనే చెప్పాలి. మన ప్రార్థనలలో అధికశాతం అర్థంపర్థం లేనివిగానూ, సంకుచితం గానూ, వినాశకరంగానూ, అతిస్వార్థంతో కూడుకున్నవిగానూ ఉంటాయి. అసలు మన ప్రార్థనలన్నీ ఫలిస్తే ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించారా? అలా జరిగితే మన జీవితాలేకాక ప్రపంచ వ్యవహారాలన్నీ కూడా తల్లక్రిందులైపోతాయి.

అందుకే భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులు స్వామి బ్రహ్మానంద మహరాజ్ ఉత్తమ ప్రార్థన అంటే ఏమిటో, భగవంతుణ్ణి మనం ఏవిధంగా ప్రార్థించాలో ఇలా చెప్పారు :

"ఓ దేవా! నాకేది మేలు చేస్తుందో, ఏది కీడు చేస్తుందో నాకు తెలియదు. కాబట్టి నేను పూర్తిగా నీమీదే ఆధారపడివున్నాను. జీవితంలో నాకు కావలసినవన్నీ నువ్వే ఇవ్వాలి. నాకు అత్యుత్తమమైన మార్గమేదో నువ్వే చూపించు. నిరంతరం నిన్ను స్మృతిలో ఉంచుకునేందుకు కావలసిన శక్తిని నాకు ప్రసాదించు."

– శ్రీరామకృష్ణ ప్రభ సౌజన్యంతో..

## పాఠకులకు ముఖ్య గమనిక

కరోనా కారణంగా దేశం మొత్తం లాక్‌డౌన్ కారణంగా ఏప్రియల్ 2020 సంచిక విడుదల చేయలేకపోయాము. అందువలన మే, జూన్ నెలల పత్రికను ఈ సంచికగా విడుదల చేయుచున్నాము. ఇకపై ప్రతిమాసం పత్రిక విడుదల చేయుటకు మా శాయశక్తుల ప్రయత్నించెదమని తెలియజేస్తున్నాము. కనుక ఈ మార్పును గమనించి సహకరించగలరని ఆశిస్తున్నాము.

– దీపిక కార్యదర్శి

# "దివ్యజ్ఞాన సమాజము - ఆత్మ విద్య ప్రణాళిక

**- శ్రీతాయ వెంకటేశ్వరరావు,**

సృష్టికి మూలం పరబ్రహ్మ. ఈ సృష్టి మూలంగానే సకలజీవకోటి మనుగడ సాగిస్తూ ఉంది. ఈ సృష్టిలోని సమస్త జీవరాసులలో మానవాళి మనుగడ ఒక బాగం మాత్రమే. అట్టి మనిషికి ఇతర ప్రాణులకు మధ్య ముఖ్యమైన ఒక్క వ్యత్యాసము ఉన్నది. మనిషి తన ఉనికి గుర్తెరిగి తాను ఉన్నానని తెలుసుకొని తన చుట్టూ జరుగుతున్నటువంటి మార్పులను చేర్పులను గ్రహించ గలడు. దీనినే "ప్రజ్ఞ" అని అంటారు. "ప్ర" అనగా 'మంచి' అని 'జ్ఞ' అనగా జ్ఞానము అని మొత్తంగా 'మంచిజ్ఞానం' అని కూడా పిలుస్తారు. దీనినే ఇంగ్లీషులో 'Consciousness' అని కూడా అంటారు. ఈ ప్రజ్ఞవలననే సృష్టిలో చలన వలనములు జరుగుతూ ఉంటాయని గ్రహించాలి. మనిషికి మరణంతో ప్రజ్ఞ అంతరిస్తుందా అనే మీమాంశ ఒకటి మదిలో ఉద్భవిస్తూ ఉంటుంది. దీన్ని తెలుసుకోడానికి కొంత శాస్త్ర పరిజ్ఞానం అవసరమవుతుంది. దీనినే మనం ఆత్మవిద్య లేదా గుప్త విద్య ద్వారానే తెలుసు కోగలుగుతాము.

ఆత్మవిద్య అనునది పురాతన మయినది మరియు సనాతనమయినది. ఈ విద్య మహర్షులు, ఋషులు, మహా పురుషులు వంటి వారికి మాత్రమే అవగాహన వస్తుంది. ఈ విద్య ద్వారా మనకు అవగతమయ్యే విషయమేమంటే ఈ విశ్వమంతా ఒకే ప్రాణము ఆవరింపబడి ఉన్నది. ఈ ప్రాణశక్తి మనుషులలోనే కాకుండా ఖనిజ సంపదలోను, వృక్ష సంపదలోను మరియు జీవజాతుల యందు కూడా ఒకే విధముగా ఉన్నదని శాస్త్ర పరిశోధనల ద్వారా తెలియుచున్నది. ఈ సృష్టికి మూలం ప్రకృతి అని, ఆ ప్రకృతిని భగవంతుడు సృష్టించాడు అని మనకు వేదాల ద్వారా తెలియుచున్నది. "ఏకమేవా అద్వితీయం" అని ఒక వేద వాక్యమున్నది. ఇది సర్వశక్తి తత్వాన్ని తెలియచేస్తున్నది. దీనినే పరతత్వం అని కూడా అంటారు. ఇది సృష్టిలో తనంతట తానే వ్యక్తమవుతుంది. మరల తనంతట తానే ఉపసంహరించుకుంటుంది. దీనిని దివ్యజ్ఞాన వాఙ్మయంలో ఇంగ్లీషులో ఇలా తెలియచేశారు.

"Theosophy tells us all that is manifested comes from one source, All shall return to the same source"

జీవకోటి అంతటా అణుమయం. అట్టి అణువుల మధ్యస్థ భాగం ప్రాణశక్తిచే నింపబడి ఉంది. మేడమ్ బ్లావట్స్కీ తెలియచేసిన విధంగా మన చుట్టూ మనకు తెలియని ప్రపంచం మరొకటి ఉన్నది. దాన్ని తెలుసుకుని దానిలోని ప్రజ్ఞను

వెలికితీయడమే దివ్యజ్ఞాన సమాజం యొక్క మూడవ ముఖ్య ఉద్దేశము. ఈ సృష్టిలో రెండు రకముల పదార్థాలున్నవి. ఒకటి ద్రవ్యము. మరొకటి ప్రాణము (శక్తి). ప్రాణరహితమయిన పదార్థముందని మన మనుకుంటూ ఉంటాము. కానీ ఈ సృష్టిలో ప్రాణరహితమయిన పదార్థము ఏదీ లేదని శాస్త్ర ప్రయోగాల ద్వారా తెలియ జేయడమయినది. జీవం అనునది మన చుట్టూ అంతర్గతంగా ఉంటుంది. కాని మన కంటికి కనిపించదు.

భౌతికంగా మనకు కనిపించే పదార్థం గట్టిగాను, నీళ్ళుగాను మరియు వాయువుగాను కనిపిస్తుంది. రసాయనిక శాస్త్ర దృష్టితో చూచినపుడు ఒక విధంగాను, మరియు భౌతికశాస్త్రంలో మరోవిధంగాను, బహిర్గతమౌతుంది. కాని శాస్త్ర పరిశోధన ద్వారా తేలినదేమనగా అసలు విశ్వంలో పదార్థమనేది లేదని, అంతా శక్తి స్వరూపమే నని వివరించడం జరిగింది. మనం ద్రవ్యం అనుకున్నది శక్తి సంపద (Energy) మాత్రమే అది అనేక రూపాలలో అవగతమవుతుంది.

విశ్వం యొక్క ఆవిర్భావాన్ని పరికించినట్లయితే దీని ఆవిష్కరణ జరిగి 1400 కోట్ల సం॥లు గడిచిందని, శాస్త్రజ్ఞులు తెలియజేస్తున్నారు. దీని ఆవిష్కరణ Big Bang Theory ద్వారా నెరవేరిందని ప్రముఖ ఖగోళశాస్త్రవేత్త అయినటువంటి 'జార్జస్ లెమైటర్' ద్వారా తెలియడ మయినది. వారు ప్రవేశపెట్టిన సిద్ధాంతం ప్రకారం ఊహాకందని కాలంలో అత్యధిక సాంద్రత కలిగినట్టి ఒక సూక్ష్మబింధువు ఘర్షణకు లోనై విస్ఫోటం చెందినాదని, దాని ద్వారా జనించిన వాయువులు గురుత్వాకర్షణ శక్తి ద్వారా దాని సాంద్రత ఊహాకందని స్థాయిలో పెరిగిపోయి విస్ఫోటం చెంది దాని శకలముల నుంచి సూర్యుడు, చంద్రుడు, భూమి, ఇతర గ్రహములు, గ్రహశకలాలు, ఉల్కలు, తోకచుక్కలు, సౌరధూళి బయల్పడినవని తెలియ జేస్తున్నారు. అవన్నీ సూర్యుని చుట్టూ పరిభ్రమించుచున్నవని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జరిపిన ప్రయోగాల ద్వారా Higgs Boson అనే దైవీకణం ద్వారానే విశ్వావిర్భావం జరిగిందని నమ్ముచున్నారు.

హిందూ, బౌద్ధ సంప్రదాయాల ప్రకారం మనిషి తాలూకు సూక్ష్మశరీరాల గురించి అనేక వర్ణనల నిచ్చారు. ఇతర లోకాలలో కూడా స్థూలము, సూక్ష్మము, సూక్ష్మతలము అయి ఉన్నదని వివరించారు. ఈ లోకాలన్నీ ఒకదానిపై మరొకటి ఓతప్రోతమై ఒకదానితో మరొకటి చొచ్చుకొని ఉన్నవని తెలియజేశారు. ఈ లోకాలను మనము భూః భువః సువః మహః జనః తపః మరియు సత్యః అని వ్యక్తీకరించు చున్నాము. విశ్వంలో లోకములో ఏ విధముగా ఓతప్రోతమై ఉంటవో, మానవుడు అనేక స్థాయిలో వ్యవహరించడానికి తగిన సూక్ష్మ శరీరములు లేదా కోశములను ఏర్పరచుకుని ఉన్నారు. ఇవి 1) అన్నమయ కోశము 2) ప్రాణమయ కోశము 3) మనోమయ

కోశము 4) విజ్ఞానమయ కోశము మరియు 5) ఆనందమయ కోశము ఆధ్యాత్మిక స్థితిని సంప్రాప్తించుకోడానికి ఈ కోశములను శుభ్రపరచుకోవలసి ఉంటుంది.

ఆత్మ విద్య ప్రకారము మనిషి కావలసిన ఆధ్యాత్మిక ప్రగతి ఒక్క జన్మలో రాదు. మనిషికి 777 జన్మలుంటవని ఆధ్యాత్మిక వేత్తలు తెలియజేస్తున్నారు. 700 జన్మలు అనాగరిక జీవితంలో జరుగుతాయి. 70 జన్మలు నాగరిక జీవనంలోను మరియు 7 జన్మలు ఆధ్యాత్మిక ప్రగతిని సాధించే రీతిలో జరుగుతాయి. ఈ గోళంపై మానవాళి ఆవిర్భవించి 18 మిలియన్ సంవత్సరాలు దాటినాయి. ఆత్మ విద్య తాలూకు ప్రతిమనిషికి పుట్టుక – చావుకు మధ్య కాలాన్ని జీవితం అంటారు. అన్ని జీవితాలకు సంబంధించి ఒక సూక్ష్మశరీరముంటుంది. దానిని కారణ శరీరమని పిలుస్తారు. అది కంటికి కనిపించదు. దానినే మాయ అని కూడా అంటారు.

మాయ అనునది వేదాలలోను, ఉపనిషత్తులలోను కనిపిస్తుంది. మూల ప్రకృతినే మాయ అని లేదా ఏది ఎరుక లేనిదో దానినే 'మాయ' అని అంటారు. ఆకసమున మెరుపు మెరిసి క్షణకాలంలో అదృశ్యమయి పోవునది గూడా మాయే. మానవునిలోని స్థూలశరీరంలోని అణువులు ఏడేళ్ళ కొకసారి పరిపూర్ణంగా మారిపోతూ ఉంటవి అని జీవశాస్త్రం చెబుతుంది. దీనితో మనిషిరూపం మాత్రం మారుతుంది గానీ అతడు చేసిన మంచి చెడుకు సంబంధించిన కార్యక్రమాలు జీవితకాలం గుర్తుండిపోతాయి. ప్రతి మనిషిలోని శక్తిసామర్థ్యాలు సమానంగానే ఉంటవి. కొన్ని వెలికి వస్తాయి. మరికొన్ని మరుగున పడతాయి. వాటిని వెలికి తీయడమే దివ్యజ్ఞాన సమాజ 3వ ముఖ్య ఉద్దేశ్యము. ప్రతిమనిషికి ఏడు తత్వాలున్నవి. స్థూలశరీరమనేది పైన కనిపించే కోటు వంటిది. మరణం సంభవించగానే ఆకోటుని విసర్జిస్తాడు. స్థూలశరీరంలోని అణువులన్నీ పంచభూతములలో కలిసి పోతవి. మనిషిలోని ప్రజ్ఞ స్థూల శరీరాన్నంటి పెట్టుకొని ఉన్న లింగశరీరము లేదా సూక్ష్మశరీరాన్నాశ్రయించు కొని ఉంటుంది. మన స్పృహలో ఉండదు. తదుపరి లింగ శరీరంలోని అణువులు రాలిపోయి అరూప స్థాయిలో ఉండి కారణశరీరంలోకి ప్రవేశిస్తవి. ఈ లోకంలో స్మృతులేవీ గుర్తుండవు.

మానవాళి ప్రస్తుతం ఉన్న స్థితిలో మనస్సు వికసించి ఉంది. ఏది సబబో, ఏది కాదో అనే విషయాన్ని గ్రహించే శక్తి మనస్సుకు ఉంటుంది. ఆధ్యాత్మిక ప్రగతి నందుకునే శక్తి సామర్థ్యాలుంటవి. ప్రతిమనషి ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలనే దృఢ సంకల్పాన్ని కలిగి ఉండాలి. ఇదే ఆత్మ విద్య ప్రాబల్యానికి నాందిగా ఇనుమడిస్తుంది.

***ఆత్మవిద్య – శారీరాలు వాహకాలు అను గ్రంథ సౌజన్యంతో***

# వార్తలు - విశేషాలు

**రాయలసీమ దివ్యజ్ఞాన సమాఖ్య కార్యక్రమ వివరాలు :**

ఫిబ్రవరి 1వ తేది నుండి 5వ తేదీ వరకు రాయలసీమ సమాఖ్య కార్యదర్శి శ్రీ ఎమ్.ఎస్.రఘునాధ్, చిత్తూరు లోని అనిబెసెంట్ లాడ్జి, మదనపల్లిలోని జిజ్ఞాస లాడ్జిలను TOS కార్యదర్శి శ్రీ కె.శివప్రసాద్ సహాయముతో తిరిగి పునః ప్రారంభించారు. కొన్ని దశాబ్దాల తరువాత భారత సమాజ పూజ, అధ్యయనం ప్రారంభించారు. బిసెంట్ కళాశాల మదనపల్లి ప్రిన్సిపాల్‌తో చర్చలు జరిపారు.

9-2-2020వ తేదీన అమ్ముగూడ జ్ఞానభారతి లాడ్జిలో RTF వారు నిర్వహించిన కార్యక్రమంలో కొత్తవారిని చేర్చి వారికి ప్రోత్సాహకాలను అందించారు.

16-2-2020 వ తేదీన మియాపూర్ ఆర్కే సెంటర్‌లో రిసోర్స్ పర్సన్స్, లాడ్జి ఆర్గనైజర్స్ సమావేశం జరిగింది. కొత్త వ్యాఖ్యాతలు 15 నిమిషాలు పాటు అనర్గళంగా ఉపన్యసించగలిగారు.

17 ఫిబ్రవరిన అన్ని దివ్యజ్ఞాన సమాజముల వారు "అడయారు డే" ను జరుపుకున్నారు. అడయార్ డే విరాళాలను అడయార్‌కు పంపించారు.

అమరాపురం గురుకృప దివ్యజ్ఞాన సమాజంలో ప్రతి ఆదివారం జరుగు భారత సమాజపూజకు 60 మంది హాజరయ్యారు. రోజు సాయంత్రం దివ్యజ్ఞాన అధ్యయనం జరుగుతుంది.

గుంటూరు, రాయదుర్గం, సికింద్రాబాద్, జ్ఞానభారతి, కడపలలో ప్రతి ఆదివారం భారత సమాజ పూజ జరుపుతున్నారు.

చింతన, శ్రీ లలితా, ప్రణవ, హైదరాబాద్, వశిష్ఠా మొదలగు దివ్యజ్ఞాన సమాజములో దివ్యజ్ఞాన అధ్యయనం జరుగుతున్నదని సమాఖ్య కార్యదర్శి దీపికకు తెలియజేసారు.

**బళ్ళారి :** సన్మార్గ దివ్యజ్ఞాన సమాజం వారు 17-2-2020 నాడు అడయార్ దినోత్సవం జరుపుకున్నారు. శ్రీ యస్.రంగయ్యశెట్టి అడయార్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మూడువేల రూపాయలను అడయార్ పంపించారు.



**ధవళేశ్వరం :** గోదావరి దివ్యజ్ఞాన సమాజంలోని సభ్యురాలు పావని గారు 24-1-2020వ తేదీన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గారి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందినారు. సమాజ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసారు.



15-2-2020 వ తేదీన జరగిన ఆధ్యాత్మిక సమావేశానికి తెలుగు సమాఖ్య అధ్యక్షులు శ్రీ కె.యస్.రామచంద్రరావుగారు, రాయలసీమ సమాఖ్య పూర్వ కార్యదర్శి శ్రీ కె.వి.యల్.కాంతారావు గారు, తెలుగు సమాఖ్య లెక్చరర్ లక్ష్మిగారు అతిథులుగా విచ్చేసారు. ఈ కార్యక్రమం ఉడతా రంగారావు గారి అధ్యక్షతన జరిగినది. శ్రీ కె.యస్.రామచంద్రరావు గారు ధవళేశ్వరం, సమాజ సభ్యులను అతిథులకు పరిచయం చేసి సమాజ స్థితిగతులను అందరికి వివరించారు. ఈ సందర్భంగా కాంతారావు గారు దివ్యజ్ఞాన మార్గాన్ని ఎందుకు ఎంచుకోవాలి? ఎందుకు ఈ మార్గంలో మనం నడవాలి? ఎలా మనల్ని మహాత్ములు దివ్యజ్ఞానాన్ని నలుదిక్కులా విస్తరింప జేయుటకు ఎంచుకున్నారో వివరించారు.

లక్ష్మిగారు 'ప్రేమ' అనే అంశంపై ప్రసంగించారు. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి ఎటువంటి జీవనశైలిని అలవర్చుకోవాలి అనే విషయాలను తత్వ ఉదాహరణలతో వివరించారు. సమాజ కార్యదర్శి ఉడతా రంగారావు గారు సభను ముగించారు.

**గుంటూరు :**

శ్రీ కృష్ణ దివ్యజ్ఞాన సమాజం వారు 22 ఫిబ్రవరి 2020వ తేదీన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ దివ్యజ్ఞాన సమాఖ్య కార్యదర్శి శ్రీ ఎమ్.యస్.రఘునాధ్ ముఖ్యఅతిధిగా హైదరాబాద్ నుండి విచ్చేసారు.

22వ తేదీ మధ్యాహ్నం గం.3.30 ని.లకు శ్రీశారదానికేతనమ్ పాఠశాల విద్యార్థినులకు మరియు గం.4.30 ని.లకు కళాశాల విద్యార్థినులకు ఏకాగ్రత, పట్టుదల, కృషి ఉంటే ఏవిధంగా అన్నిటా విజయం సాధించ గలమో వివరించారు. వీటిని అభివృద్ధి పరుచుకొనుటకు చేయవలసిన కృషి గురించి తెలియచెప్పారు. అలాగే ఆధ్యాత్మిక ఆలోచనలను పెంపొందించు కోవాలని అందుకు దివ్యజ్ఞాన సమాజం ఎంతో తోడ్పడుతుందని వివరించారు.





అదేరోజు సాయంత్రం 6 గంటలకు దివ్యజ్ఞాన సమాజ ఆవరణలో 'బ్రహ్మవిద్య–ప్రాథమిక సూత్రాలు' అనే అంశం మీద ఉపన్యసించారు. ఈ కార్యక్రమానికి సుమారు 20 మంది సభ్యులు, ఇతరులు హాజరైనారని కార్యదర్శి దీపికకు తెలియజేసారు.

8 మార్చి, 2020 వ తేదీన శ్రీ కృష్ణదివ్యజ్ఞాన సమాజంలో Key to theosophy లోని రెండవ అధ్యాయం పూర్తి చేసారు. ఈ కార్యక్రమానికి సుమారు 10 మంది సభ్యులు హాజరైనారని కార్యదర్శి దీపికకు తెలియజేసారు.

**విజయనగరం :**

వశిష్ఠాలాడ్జివారు 17.2.2020 వ తేదీన అడయార్ డే దినోత్సవాన్ని జరుపుకున్నారు. లాడ్జి అధ్యక్షులు శ్రీ పి.వి.నరసింహరావు అధ్యక్షతన సమాఖ్య ఉపాధ్యక్షులు శ్రీమతి మాండలీక లక్ష్మి 'అడయార్ దినోత్సవ' ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సువర్ణ సోపానాలు పఠనం జరిగింది.

**రాజమహేంద్రవరం :**

2.2.2020 నాడు సా. 4.30 గంటలకు ఆధ్యాత్మిక స్వస్థత పార్టు-2 గురించి డాక్టర్ శ్రీ కేదారేశ్వర్ గారు అవగాహన సదస్సు నిర్వహించారు.

9.2.2020 రాజమండ్రి లాడ్జి సర్వసభ్య సమావేశం జరిగింది. తెలుగు సమాఖ్య సెంటినరీ కార్యక్రమాల గురించి తెలుగు సమాఖ్య అధ్యక్షులు శ్రీ కె.యస్. రామచంద్రరావు అధ్యక్షతన చర్చ జరిగినది. అనంతరం 'సీక్రెట్ డాక్ట్రిన్' గురించి జాతీయ ఉపన్యాసకులు శ్రీ యు.యస్.పాండె వివరించారు.


16.2.2020 ఎగ్జిక్యూటివ్ మీటింగ్ జరిగింది. శ్రీ కె.యస్. రామచంద్రరావు సమాఖ్య కార్యదర్శి శ్రీ జి.సుబ్రహ్మణ్యం చర్చించారు.

16.2.2020 సా.6 గం.30 ని.లకు "ప్రస్తుత సమాజంలో దివ్యజ్ఞాన ఆవశ్యకత" అనే అంశం గురించి శ్రీమతి ఎమ్.లక్ష్మి చర్చ నిర్వహించారు.


23.2.2020 నాడు ఆధ్యాత్మిక స్వస్థత పార్టు-3 గురించి వివరించి, సభ్యులందరి చేత శ్రీ యు. కేదారేశ్వరుడు సాధనాక్రియలు చేయించారు.

**మచిలీపట్టణం :**

మచిలీపట్టణ దివ్యజ్ఞాన సమాజ సభ్యులైన శ్రీ గుడిసేవ మురళీధర్ హైయ్యర్ డిప్లొమో ఇన్‌థియోసఫి (2019 సంవత్సరం నకు గాను) సాధించారు. ఈ డిప్లొమా "ద థియోసాఫికల్ సొసైటీ ఇన్ ఇంగ్లాండ్" వారు అందించారు. వారికి దీపిక శుభాకాంక్షలు తెలుపుచున్నది.



# శుభాకాంక్షలు





శ్రీ కె. శివప్రసాద్‌గారు, నేషనల్ సెక్రటరీ, TOS in India పదవి నుండి డైరెక్టర్, TOS in India పదోన్నతి సందర్భంగా వారికి శుభాకాంక్షలు.

శ్రీ కె. శివప్రసాద్‌గారు 10 జులై 1955 లో చిత్తూరు జిల్లాలో జన్మించారు. వారు బోటనీ M.Sc.లో ఉత్తీర్ణులై ఫారెస్టరీ రీసెర్చ్ మరియు బోధనలలో పనిచేసారు. తరువాత Action for Food Production (AFPRO) లో పనిచేసారు. ఈ సంస్థలో పనిచేస్తూ పేద రైతులకు ఎంతో సేవ చేసారు. నేషనల్ బయోడైవర్సిటీ అథారిటి వారితో కలసి ఆరు సంవత్సరాలలో నెదర్‌లాండ్స్, యునైటెడ్ కింగ్‌డమ్, స్విట్జర్‌లాండ్, అమెరికా, నేపాల్, ఫిలిఫైన్స్ మరియు సింగపూర్‌లలో పర్యటించి ప్రకృతి పరిరక్షణకు సంబంధించి ఎన్నో సేవలు అందించారు.

2002 లో హైదరాబాద్ దివ్యజ్ఞాన సమాజంలో చేరి సమాజ కార్యదర్శి, ఉపకార్యదర్శిగా, కౌన్సిల్ మరియు ఇ.సి. సభ్యునిగా ఎన్నో సేవలందించారు. 2009వ సంవత్సరం నుండి రీజనల్ TOS కార్యదర్శిగా ప్రారంభించి తన సేవల ద్వారా 2017లో TOS in India నేషనల్ సెక్రటరీగా పదోన్నతులైనారు. కాగా మార్చి 1, 2020 న దివ్యజ్ఞాన సమాజ అంతర్జాతీయ అధ్యక్షులు శ్రీ టిమ్ బాయిడ్ గారు శ్రీ కె. శివప్రసాద్ గారిని డైరెక్టర్ TOS in India గా నియమించారు. వీరు ఎంతో భక్తిశ్రద్ధలతో దివ్యజ్ఞాన సంస్థలకు మరియు సమాజములోని వివిధ పీడితులకు ఆపన్నులకు సేవ చేయటయే లక్ష్యంగా జీవిస్తున్నారు. వీరి శ్రీమతి ఆల్ ఇండియా రేడియోలో పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వీరి ఈ ఉన్నతికి, కృషికి దీపిక శుభాకాంక్షలు తెలుపుతున్నది.